నవతెలంగాణ
ఆదిలాబాద్
మంగళవారం | ఏప్రిల్ 09, 2024 | www.navatelangana.com

టోల్‌ప్లాజా చెక్‌పోస్టు వద్ద రూ.69వేలు పట్టివేత

నవతెలంగాణ - వాంకిడి

మండలంలోని ఇందానీ ఎక్స్ రోడ్డు వద్ద సోమవారం సాయంత్రం వాహనాల తనిఖీ చేస్తుండగా సరైన ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.69 వేల నగదును పట్టుకున్నట్టు ఎస్ఐ సాగర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం..మహారాష్ట్రలోని డివిటి గ్రామానికి చెందిన పావులె చంద్రకాంత్ బొలేరో పికప్ వాహనంలో ఆసిఫాబాద్ వైపు నుండి మహారాష్ట్ర డివిటి గ్రామానికి వెళ్తుండగా అతని వద్ద నుండి రూ.69వేలు పట్టుకున్నారు. నగదుకు సంబంధించి ఎటువంటి ధృవీకరణ పత్రాలు లేకపోవడంతో నగదును సీజ్ చేసి ఎస్-ఎస్టీ టీంకు అప్పగించినట్టు ఎస్ఐ పేర్కొన్నారు. తనిఖీలో రిజర్వుడ్ ఇన్‌స్పెక్టర్ జగ్గయ్య, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



పేదలకు కారం పొడి పంపిణీ

నవతెలంగాణ - పెంచికల్‌పేట్

మండలంలోని బొంబాయిగూడ గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త చపిడె ప్రకాష్ గ్రామంలోని ఎస్సీ కాలనీలో 10 నిరుపేద కుటుంబాలకు నిత్యావసర సరుకైన కారాన్ని అందజేశారు. పేద కుటుంబాలు ఎక్కడున్న సహాయం చేయడానికి సిద్ధంగా ఉన్నానని ఆయన అన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు గుండయ్య, గంగారాం, శంకర్ పాల్గొన్నారు.



టీబీజీకేఎస్ బలోపేతానికి కృషి

- గోలేటి సీహెచ్‌పిలో సభ్యత్వ నమోదు



నవతెలంగాణ - రెబ్బెన

సింగరేణిలో అనేక హక్కులు సాధించిన టీబీజీకేయస్ బలోపేతానికి కృషి చేస్తామని బెల్లంపల్లి ఏరియా వైస్ ప్రెసిడెంట్ మల్రాజ్ శ్రీనివాస్‌రావు అన్నారు. సోమవారం గోలేటి సీహెచ్‌పీలో టీబీజీకేయస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు టీబీజీకేయస్ కార్యకర్తలకు సభ్యత్వం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి ఉద్యోగులకు టీబీజీకేయస్ ఎన్నో హక్కులు సాధించిపెట్టిందని, ముఖ్యంగా వారసత్వ ఉద్యోగాలు ఇచ్చిన ఘనత టీబీజీకేయస్ యూనియన్‌కే దక్కుతుందన్నారు. కార్మికుల కోసం నిత్యం పోరాడే సంఘం తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘమన్నారు. సింగరేణి కార్మికులకు కోలిండియలో లేని హక్కులను సాధించి పెట్టిన టీబీజీకేయస్‌లో కార్మికులు పెద్దఎత్తున సభ్యత్వం తీసుకోవాలని కోరారు. ఈ నెల 24న గోదావరిఖనిలో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం సర్వసభ్య సమావేశం ఉంటుందని, అందులో టీబీజీకేయస్ సెంట్రల్ కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరుగుతుందన్నారు. టీబీజీకేయస్ బీఆర్ఎస్‌కు అనుబంధంగానే కొనసాగుతుందని, కానీ యూనియన్‌లో పార్టీ జోక్యం ఏ మాత్రం ఉండదని తెలిపారు. యూనియన్ ఫైనాన్స్ ప్రకారం కార్యకర్తల మనోభావాల మేరకే కమిటీల ఎన్నిక, పోరాట కార్యక్రమం, భవిష్యత్ కార్యక్రమం నిర్ణయించబడుతుందని తెలిపారు. కార్యక్రమంలో టీబీజీకేయస్ ఏరియా నాయకులు మాంతు సమ్మయ్య, అలవేని సంపత్, వంగ మహేందర్, వరలక్ష్మి, ఆర్ శ్రీనివాస్, ఫిట్ సెక్రటరీ మెరుగు రమేష్, అసిస్టెంట్ ఫిట్ కార్యదర్శులు మర్రి సమ్మయ్య, అర్జయ్య, నాయకులు మురళీకృష్ణ, కవిత, సాగర్, శ్రీనివాస్, అజాజ్ పాల్గొన్నారు.

వార్షిక పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయాలి

- పలు ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేసిన ఏసీఎంఓ పుర్క ఉద్ధవ్



నవతెలంగాణ-కెరమెరి

త్వరలో త్వరలో నిర్వహించే 1 నుండి 9వ తరగతి వరకు పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయాలని ఏసీఎంఓ పుర్క ఉద్ధవ్ అన్నారు. సోమవారం మండలంలోని హట్టి, బాబేఝరి, జోడేఘాట్ ఆశ్రమ పాఠశాలలతో పాటు టీడబ్ల్యూపిఎస్ చిన్న పాట్నాపూర్,పెద్ద పాట్నాపూర్, సాకడ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పాఠ్యాంశాలను చదివించారు. సబ్జెక్టుల వారీగా పాఠ్యాంశాలపై పలు ప్రశ్నలు వేసి సమాధానాలను రాబట్టారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయ సిబ్బందికి పలు సూచనలు చేశారు. సిలబస్ పూర్తిపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలకు గైర్హాజరవుతున్న విద్యార్థులను తిరిగి పాఠశాలలకు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతిరోజు విద్యార్థులకు తాగేందుకు చల్లని నీటిని అందించాలన్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి, కనీస అభ్యసన సామర్థ్యాలు వచ్చేలా చూడాలన్నారు. త్వరలో నిర్వహించే వార్షిక పరీక్షలకు విద్యార్థులను సంసిద్ధులను చేయాలని ఉపాధ్యాయ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్పీ వామన్, హట్టి ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రేందాస్, జోడేఘాట్ హెచ్ఎం ఆత్రం మోతీరాం, ఎస్ఆర్పీ శ్యాంరావు, వసంత్‌రావు పాల్గొన్నారు.

కార్డెన్ సెర్చ్‌లో పలువురిపై కేసు నమోదు



నవతెలంగాణ - చింతలమానేపల్లి

మండలంలోని లంబాడిహెటి, గుప్పగూడ గ్రామాలలో కౌటాల సిఐ సాదిక్ పాషా, సాయుధ భద్రత బలగాల ఆధ్వర్యంలో కార్డెన్‌సెర్చ్ చేపట్టారు. గుడుంబా కాస్తున్న లంబాడిహెటి గ్రామానికి చెందిన తిరుపతి, దరావత్ జగ్యానాయక్, గుప్పగూడ గ్రామానికి చెందిన అజ్మీర శివరాం, లవుడ్య బాలు, భూక్యా తిరుపతిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేష్ తెలిపారు.

ఏరువాక సాగాలి..అన్నదాత మురవాలి..!

- తొలుత అతివృష్టి..తర్వాత అనావృష్టి
- ఈ ఏడాది ఆశించిన స్థాయిలో కనిపించని ఫలితం
- తాజాగా రుణమాఫీ, రైతుభరోసా, పంట భీమాపై ఆశలు
- కొత్త ఆశలతో నేటి నుంచి ఖరీఫ్‌సాగుకు శ్రీకారం

వ్యవసాయమే జీవనాధారంగా బతుకుతున్న అన్నదాతలను ప్రకృతి వైపరిత్యాలు వెంటాడుతున్నాయి. వర్షాధారంపై ఆధారపడి పంటలు సాగుచేస్తున్న కర్షకులు ప్రతి ఏటా మేఘాల వైపు చూడాల్సిన పరిస్థితి. మేఘాలు కరుణిస్తే వర్షాలు..లేదంటే కన్నీళ్లు అనే పరిస్థితి ఉంది. వ్యవసాయంలో ఏటా నష్టాలు పలకరిస్తున్నా సాగును మాత్రం వదులుకోవడం లేదు. కష్టమైనా..నష్టమైనా సాగు చేయడమే మార్గం కావడంతో ఏటా ఇష్టంతో పంట సాగును ప్రారంభిస్తుంటారు. ఈ ఏడాది తొలుత భారీ వర్షాలతో పంటలను ముంచెత్తగా.. ఏపుగా పెరిగే దశలో వర్షం జాడ లేకుండా పోయింది. కనీసం పండిన పంటనైనా అమ్ముకుందామంటే మార్కెట్‌లో సరైన గిట్టుబాటు ధర లభించలేదు. యాసంగి సీజన్‌లో ప్రాజెక్టుల్లో నీళ్లుఅడుగంటిపోవడంతో పూర్తిస్థాయిలో పంటలు పండించలేకపోయారు. తాజాగా మంగళవారం ఉగాది పర్వదినం కావడంతో అనేక మంది రైతులు ఖరీఫ్‌సాగుకు శ్రీకారం చుట్టనున్నారు. రానున్న ఈ ఏడాదిలోనైనా సమృద్ధిగా పంటలు పండి తమ సిరులు కురిపించాలని కొంగొత్త ఆశలతో సాగును ప్రారంభిస్తున్నారు.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అంటేనే పత్తిపంటకు ప్రధాన కేంద్రంగా భావిస్తారు. 80శాతం పంటలు వర్షాధారం మీద ఆధారపడి పండిస్తుంటారు. 2024-25 ఏడాదిలో ఉమ్మడి జిల్లాలో 17.30లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేయగా ఇందులో ప్రధానంగా పత్తి పంట 11.20లక్షల ఎకరాల్లో సాగు చేశారు. మరోపక్క వరి 3లక్షల ఎకరాలు, సోయా 2.20లక్షలు, కంది 1.10లక్షల ఎకరాల్లో సాగు చేయగా మిగితా ఎకరాల్లో మొక్కజొన్న, పెసరి, మినుము, సజ్జలతో పాటు కూరగాయల పంటలు సాగు చేశారు. ఈ సారి మార్కెట్‌లో వివిధ పంటలను ప్రయివేటుతో పాటు ప్రభుత్వ రంగ సంస్థలు కొనుగోలు చేశాయి. ప్రభుత్వ మద్ధతు ధర రూ.7020ఉండగా మార్కెట్‌లో పత్తికి తొలుత క్వింటాల్‌కు రూ.8వేలకు పైగా ధర పలుకుతుందని ఆశించినా.. క్వింటాల్‌కు రూ. 7200వరకు పలికింది. చివరి వరకు ఇంతకంటే తక్కువగానే ధర పలికినా పెరిగిన సందర్భాలు కనిపించలేదు. ఈ ఏడాది ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సుమారు 44లక్షల క్వింటాళ్ల పత్తి మార్కెట్‌కు వచ్చిందని అధికారులు చెబుతున్నారు. మరోపక్క ఈ ఏడాది కందికి ప్రభుత్వ మద్ధతు ధర క్వింటాల్‌కు రూ.6వేలు ఉండగా మార్కెట్‌లో రూ.10వేల వరకు ధర పలకడం రైతులకు



ఊరటనిచ్చేదిగా మారింది. మిగితా పంటలను సైతం ప్రభుత్వ రంగ సంస్థలు కొనుగోలు చేయడం రైతులకు కొంత ఉపశమనం కలిగించింది.

కొత్త సర్కారుపై ఆశలు..!

ఈ ఏడాది లాభ నష్టాల మధ్య సాగిన వ్యవసాయంపై రానున్న కొత్త సంవత్సరంలో కర్షకులు అనేక ఆశలు పెట్టుకున్నారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరడం.. అన్నదాతల కోసం వివిధ పథకాలు అమలు చేస్తామని హామీలు ఇవ్వడంతో వాటి కోసం ఆతృతగా ఎదురుచూస్తున్నారు. ముఖ్యంగా రూ.2లక్షల రుణమాఫీ అమలతో పాటు రైతుభరోసా కింద ఎకరానికి ఏడాదికి రూ.15వేల చొప్పున పెట్టుబడి సాయం చేస్తామని ప్రభుత్వం భరోసానిచ్చింది. ఈ పథకాల అమలుపై రైతుల్లో ఆశలు చిగురించగా.. గత ప్రభుత్వం 2018లో నిలిపివేసిన ఫసల్ బీమా యోజన పథకాన్ని మళ్లీ అమలు చేస్తామని కాంగ్రెస్ సర్కారు ప్రకటించింది. పంటలకు భీమా సౌకర్యం కల్పిస్తే.. ప్రకృతి వైపరిత్యాలు, వర్షాభావం తదితర కారణాలతో పంటలు నష్టపోయిన రైతులకు ఇన్సురెన్సు కంపెనీల నుంచి పరిహారం వచ్చేందుకు అవకాశం ఉంటుంది. 2018 వరకు పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం మంజూరు కాగా.. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం గత ఐదేండ్ల నుంచి తన వాటాగా ప్రీమియం చెల్లించకపోవడంతో పంటల బీమా అమలు కాలేదు. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తామని చెప్పడంతో అన్నదాతల్లో ఆనందం వ్యక్తమవుతోంది. మరోపక్క విత్తనాలను సైతం రాయితీపై సరఫరా చేస్తామని భరోసానివ్వడం ఊరటనివ్వనుంది.

నకిలీ విత్తనాలు అరికట్టాలి

నకిలీ విత్తనాలు రైతులను నట్టేట్ట ముంచుతున్నాయి. ప్రతి ఏటా ఇతర ప్రాంతాల నుంచి ఉమ్మడి జిల్లాకు సరఫరా అవుతున్నాయి. అక్కడి వ్యాపారులు జిల్లాకు చెందిన కొందరు మధ్య దళారులను నియమించుకొని ఈ దందా కొనసాగిస్తున్నారు. ఫలితంగా ఈ నకిలీ విత్తనాలను కొనుగోలు చేసిన రైతులు అవి మొలకెత్తకపోవడం.. పంట ఎదుగుదల లోపించడం కారణంగా తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రభుత్వం టాస్క్‌ఫోర్స్ టీంలను ఏర్పాటుచేసి ఈ నకిలీ విత్తనాలపై కొరఢా ఝులిపిస్తున్నా..పూర్తిస్థాయిలో నియంత్రించడం లేదనే అభిప్రాయం ఉంది. ప్రతి వేసవిలోనే ఇక్కడకు దిగుమతి కావడం.. వర్షాకాలం ప్రారంభం కాగానే ఆయా పల్లెలు, దుకాణాలకు వీటిని చేరవేస్తుంటారనే ప్రచారం ఉంది. ప్రతి ఏటా ఈ నకిలీ విత్తనాలు పట్టుబడుతున్నా.. రవాణాను మాత్రం నిర్మూలించకపోతున్నారనే విమర్శలున్నాయి. ఈ ఏడాది సైతం అలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా ప్రభుత్వం, ఉన్నతాధికారులు నకిలీ విత్తనాలపై ఉక్కుపాదం మోపాలని అన్నదాతలు కోరుతున్నారు.

ఎన్నికల నిర్వహణలో సెక్టార్ అధికారుల పాత్ర కీలకం

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఎన్నికల నిర్వహణలో సెక్టార్ అధికారుల పాత్ర కీలకమని, అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేలా కృషి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. సోమవారం జిల్లాలో నియమించిన సెక్టార్ అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణు, ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ రాజస్వ మండల అధికారులు లోకేశ్వర్‌రావు, కాసబోయిన సురేష్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కార్యచరణ విడుదల అయిన తేదీ నుండి విధులు కేటాయించబడిన అధికారులు ప్రతి ఒక్కరూ తమకు కేటాయించిన విధులను బాధ్యతగా నిర్వర్తించాలని, ఈ క్రమంలో ఎన్నికలలో పోలింగ్ ప్రక్రియ ముగింపు వరకు సెక్టార్ అధికారుల పాత్ర కీలకమైనదని అన్నారు. సెక్టార్ అధికారులు తమకు అందించిన హ్యాండ్ బుక్‌లో పొందుపరిచిన ప్రతి అంశాన్ని తెలుసుకొని ఉండాలని, పోలింగ్ కేంద్రంలో చేయవలసిన ఏర్పాట్లపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ర్యాంప్, తాగునీరు, షామియాన, మూత్రశాలలు, విద్యుత్ సౌకర్యం, ఫ్యాన్లు, ఎన్నికల సిబ్బందికి, రాజకీయ పార్టీలతో నియమింపబడిన బూత్ స్థాయి ఏజెంట్లకు అవసరమైన ఫర్నిచర్ సమకూర్చడంతో పాటు పోలింగ్ కేంద్రానికి రహదారి, అంతర్గత రహదారుల ఏర్పాట్లపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. వేసవి దృష్ట్యా అధిక ఉష్ణోగ్రత ఉన్నందున ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని, దివ్యాంగ ఓటర్లను తరలించేందుకు వీల్ చైర్లు ఉంచాలని తెలిపారు. పోలింగ్ ముందు రోజు పోలింగ్ సిబ్బందిని సురక్షితంగా తరలించాలని, పోలింగ్ రోజున ఓటింగ్ ప్రారంభానికి ముందే మాక్ పోలింగ్ నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవడంతో పాటు ప్రతి 2 గంటలకు ఒకసారి పోలింగ్ శాతాన్ని సహాయ ఎన్నికల అధికారులకు తెలియపరచాలని అన్నారు. పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని, పోలింగ్ రోజున ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలలో ఏదైన సమస్య తలెత్తినట్లయితే సంబంధిత అధికారుల సమన్వయంతో తమ వద్ద అదనంగా ఉన్న బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వివి ప్యాట్లను వినియోగించి సమస్యను తక్షణమే పరిష్కరించి పోలింగ్ ప్రక్రియ కొనసాగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సెక్టార్ అధికారులు తమ పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లు, ఇతర వివరాలపై నివేదిక అందించాలని తెలిపారు. ఎన్నికల విధులు కేటాయించబడిన అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి జిల్లాలో ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేలా కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి రమాదేవి, మాస్టర్ ట్రైనర్లు, తహసీల్దార్లు, సెక్టార్ అధికారులు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, పక్కన అదనపు కలెక్టర్లు



పాల్గొన్న అధికారులు

కబ్జా స్థలాన్ని పరిశీలించిన తహసీల్దార్

నవతెలంగాణ - పెంచికల్‌పేట్

మండల కేంద్రంలో ఆదివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ముందు ఖాళీ స్థలంలో కొందరు వ్యక్తులు పెన్సింగ్ వేయడంతో తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు కబ్జా చేసిన ప్రాంతాన్ని పరిశీలించారు. కబ్జా చేసిన వ్యక్తులకు పెన్సింగ్ తీయమని చెప్పినప్పటికీ వారు నిరాకరించారు. గతంలో తమ తాత గుడిసె ఇక్కడ ఉండేదని, ప్రభుత్వ ఆస్పత్రికి స్థలం లేక గతంలో భూమి ఇచ్చామని పేర్కొన్నారు. దగ్గర ఏవైన పత్రాలు ఉంటే తీసుకురావాలని, లేనట్టయితే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ పేర్కొన్నారు. ఆయనతో పాటు ఎంపీడీఓ అల్బర్ట్, ఎంపీఓ గంగాసింగ్, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.



అంగన్వాడీలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

- సంఘం జిల్లా కార్యదర్శి త్రివేణి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

కాంగ్రెస్ ఎన్నికలకు ముందు అంగన్వాడీలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఆర్. త్రివేణి డిమాండ్ చేశారు. సోమవారం ఇన్చార్జి డిడబ్ల్యూఓ రేబేకకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వం అంగన్వాడీలకు వ్యతిరేకంగా జారీ చేసిన జీవోలను రద్దు చేసి టీచర్లకు ఐదు లక్షలు, ఆయాలకు మూడు లక్షలు రిటైర్మెంట్ బెనిఫిట్, 60 సంవత్సరాలకు వీఆర్ఎస్ తీసుకునే కొత్త జీవో ఇవ్వాలని కోరారు. గత ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల్లో 2024 ఏప్రిల్ 30 నాటికి పదవీ విరమణ చెందేవారికి ఇవ్వనున్న బెనిఫిట్స్ పెంచాలన్నారు. గతంలో చేసిన సమ్మెకు సంబంధించి ఆంధ్రప్రదేశ్‌లో వేతనాలు ఇవ్వడమే కాకుండా అంగన్వాడీలకు అనుకూలంగా నాలుగు జీవోలు తీసుకువచ్చారని గుర్తు చేశారు. అదేవిధంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ అంగన్వాడీలకు వ్యతిరేకంగా తీసుకున్న నిర్ణయాలను ఉపసంహరించాలని, లేదంటే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో అనేక హామీలు ఇచ్చిందని వాటిని నెరవేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్, అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా నాయకులు ధనలక్ష్మీ, ఉమాదేవి, సువర్ణ పాల్గొన్నారు.

కేస్లాపూర్ ఆలయంలో అన్నదానం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ హనుమాన్ ఆలయంలో సోమవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు ధర్మపురి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి కోసం అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. హనుమాన్ భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. అంతకుముందు ఆలయ అర్చకుడు శిరీష్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు వివేక్, రూప్సర్ రమేష్, మ అశోక్ వెంకన్న భక్తులు పాల్గొన్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
మంగళవారం | ఏప్రిల్ 09, 2024 | www.navatelangana.com

అనాథ బాలికకు ఆపన్నహస్తం

నవతెలంగాణ-దిలావర్‌పూర్



తల్లిదండ్రుల అకాలమరణంతో అనాథగా మిగిలిన బాలికను బీఆర్‌ఎస్ నాయకుడు ఉదారతతో దత్తత తీసుకుని ఆపన్నహస్తం అందించారు. మండలంలోని చర్లపల్లి గ్రామానికి చెందిన న్యాకపు భీమన్న లక్ష్మీ కొన్నేండ్ల కింద మరణించారు. వారి మరణంతో కూతురు న్యాకపు ప్రతీక అనాథగా మారింది. ఇది గమనించిన బీఆర్‌ఎస్ నాయకుడు రంజిత్‌రెడ్డి ఆమె బాగోగులు చూసుకునేందుకు పాపను దత్తత తీసుకొని, ఆమె చదువుల కోసం రూ.లక్ష బ్యాంకులో జమ చేశారు. ఆమె సంరక్షణ బాధ్యత తీసుకున్న సుంకరి హనుమండ్లు, న్యాకపు ప్రతీకల ఉమ్మడి ఖాతాలో ఈ డబ్బును జమ చేశారు. అనాథగా మారిన అమ్మాయిని రక్షించేందుకు ఆపద్బాంధవుడిలా సాయం అందించిన రంజిత్‌రెడ్డిని గ్రామస్తులు అభినందించారు.

కేజీబీవీ పాఠశాల ఆకస్మిక తనిఖీ

- ఎంపీడీఓ శేఖర్

నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని సాయిలింగి గ్రామంలో ఉన్న కేజీబీవీ పాఠశాలను సోమవారం ఎంపీడీఓ శేఖర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని సమస్యలను ఎస్‌ఓ సువర్ణను అడిగి తెలుసుకోగా, పాఠశాలలో నీటి సమస్య అధికంగా ఉందని, ఎస్‌ఓ ఎంపీడీఓ దృష్టికి తీసుకురాగా వెంటనే గ్రామపంచాయతీ నీటి ట్యాంకర్ ద్వారా నీటిని తీసుకువచ్చి కేజీబీవీ పాఠశాలలోని నీటి సంపులో నీటిని నిల్వ చేస్తామని తెలిపారు. పాఠశాల మౌలిక సదుపాయాల గురించి, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనాలు పెడుతున్నారా అని తెలుసుకున్నారు. స్వయంగా ఎంపీడీఓ భోజనం రుచి చూశారు. కేజీబీవీ పాఠశాలలో నీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఎంపీఓ వినోద్, పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. ఎంపీడీఓ వెంట ప్రత్యేకాధికారి మహేష్, ఎంపీఓ వినోద్, ఎస్‌ఓ సువర్ణతో పాటు కేజీబీవీ సిబ్బంది ఉన్నారు.

ట్రాక్టర్ చోరీ చేసిన వ్యక్తి అరెస్ట్



నవతెలంగాణ-ఖానాపూర్

ట్రాక్టర్ చోరీ చేసిన వ్యక్తిని పోలీసులు సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఎస్సై లింబాద్రి తెలిపారు. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం... ఖానాపూర్ పట్టణంలోని గాంధీనగర్ కాలనీ చెందిన మహేందర్ ఈనెల 6న రాత్రి పనులు ముగించుకుని, తన ఇంటి వెనకాల ట్రాక్టర్‌ను పార్కు చేశాడు. గుర్తుతెలియని వ్యక్తి ట్రాక్టర్‌ను దొంగలించగా బాధితుని ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ట్రాక్టర్‌ను దొంగిలించిన వ్యక్తి జగిత్యాల జిల్లా సంఘం శ్రీరాంపూర్‌కు చెందిన ఆరటి రవిగా దర్యాప్తులో పోలీసులు గుర్తించారు. విచారణలో కడెం మండలంలోని మద్దిపడగా గ్రామంలో ట్రాక్టర్‌ను దాచి ఉంచినట్టు తెలిపాడు. దీంతో పోలీసులు ట్రాక్టర్‌ను రికవరీ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ కేసులో ప్రతిభ కనబర్చిన ఎస్సై లింబాద్రి, సిబ్బంది మహేష్, భీమేష్‌లను సీఐ సైదారావు అభినందించారు.

సుభాష్‌నగర్ కౌన్సిలర్ బీఆర్‌ఎస్ నుంచి సస్పెండ్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ పట్టణ మున్సిపల్ పరిధిలోని వార్డ్ నెంబర్ 13కు చెందిన బీఆర్‌ఎస్ కౌన్సిలర్ దర్శనాల లక్ష్మణ్‌ను బీఆర్‌ఎస్ నుంచి సస్పెండ్ చేస్తున్నట్టు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నాడని పార్టీ నుంచి సస్పెండ్ చేయడం జరుగుతుందని వెల్లడించారు. ఈ విషయాన్ని పట్టణ ప్రజలు, నాయకులు గమనించాలని సూచించారు.

ఏకలవ్య గురుకుల ప్రవేశ పరీక్ష వాయిదా

నవతెలంగాణ-ఉట్నూర్

తెలంగాణ రాష్ట్ర ఏకలవ్య గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్ష 2024-25 సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశానికి ఏప్రిల్ 21న నిర్వహించాల్సిన పరీక్ష వాయిదా వేసినట్టు సోమవారం ఏకలవ్య గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ తక్షశిల ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మళ్లీ ఏప్రిల్ 28న యధావిధిగా పరీక్ష ఉంటుందని, విద్యార్థులు తమ హాల్ టికెట్ డౌన్లోడ్ చేసుకుని సమయానికి తమ తమ సెంటర్ల వద్దకు చేరుకోవాలని కోరారు. తల్లిదండ్రులు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు.

ఆర్మీ జవాన్‌కు ఘన సన్మానం

నవతెలంగాణ-నార్నూర్

మండల కేంద్రానికి చెందిన నజీర్ కుమారుడు ఆసిఫ్ అస్సాం రైఫిల్ ఆర్మీ జవాన్‌గా ఎంపికై నాగాలాండ్‌లో తొమ్మిది నెలల పాటు శిక్షణ పూర్తి చేసుకొని మొదటి సారి మండల కేంద్రానికి వచ్చిన సందర్భంగా ఆయనకు సోమవారం మాజీ సర్పంచ్ గజానంద్ నాయక్ శాలువాతో ఘన సన్మానం చేశారు. ముందుగా మండల కేంద్రంలో ర్యాలీతో ఘన స్వాగతం పలికారు. అనంతరం మాజీ సర్పంచ్ మాట్లాడుతూ ఎంతో కష్టపడి అనుకున్న లక్ష్యాన్ని అందుకున్న ఆసిఫ్ నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తాడని అన్నారు. తమకు తెలిసిన రంగాల్లో యువకులు నైపుణ్యాలను ప్రదర్శించాలని సూచించారు. దేశంలో సేవ చేయడం గర్వకారణమని అన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ ఇన్‌ఛార్జి చైర్మెన్ సురేష్ ఆడే, నాయకులు మెస్రం హనుమంత్‌రావ్, సయ్యద్ ఖాసిం, ఫిరోజ్ ఖాన్, మహ్మద్ ఖురేషి, కోర్రల మహేందర్, గజానంద్, హైమద్, హుస్సేన్ ఉన్నారు.

వాలీబాల్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేత



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

మండలంలోని పొచ్చెర గ్రామంలో సోమవారం జోగు ఫౌండేషన్ ఆధ్వర్యంలో వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌లో గెలుపొందిన మొదటి బహుమతి మంచిర్యాల జట్టుకు జోగు ఫౌండేషన్ తరఫున రూ.25వేలు, ద్వితీయ బహుమతి మల్లాపూర్ రూ.15వేలు, గాలి చిన్న దేవన్న జ్ఞాపకార్థం తృతీయ బహుమతి అల్లూరి కిష్టారెడ్డి జ్ఞాపకార్థం బహుమతులు అందించటం జరిగిందని ఆదిలాబాద్ ఎంపీపీ గండ్రత్ రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మెట్టు ప్రహ్లాద్, కుమ్ర రాజు, సతీష్, రాజారెడ్డి, ఆశన్న, నిలేష్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

గర్భిణీ, బాలింతల వివరాలు సేకరించాలి

- అదనపు వైద్యాధికారి కుడ్మేత మనోహర్



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

గర్భిణుల, బాలింతల వివరాలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని అదనపు వైద్యాధికారి డాక్టర్ కుడ్మేత మనోహర్ అన్నారు. సోమవారం స్థానిక పీహెచ్‌సీలో వైద్య సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆశ, ఏఎన్‌ఎంలతో మాట్లాడుతూ గర్భిణులకు రక్త హీనత, హైరిస్క్ సమస్యలుంటే ఎప్పటికప్పుడు సమాచారాన్ని పీహెచ్‌సీలో తెలుపాలని అన్నారు. వారి వివరాలు పొందుపర్చాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రసూతి ఇంటివద్ద చేయకూడదన్నారు. ఈ సమావేశంలో డా.శ్రీకాంత్, హెచ్‌ఎస్ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రంలో ఆదిలాబాద్‌ను అగ్రభాగాన నిలుపుతాం

- బూత్ లెవెల్ ఏజెంట్లు, కోఆర్డినేటర్ల సమావేశం
- మతోన్మాద బీజేపీని గద్దె దించాలి
- ప్రజల నడ్డి విరుస్తున్న మోడీ ప్రభుత్వం
- రాష్ట్ర మంత్రి, జిల్లా ఇన్‌చార్జి సీతక్క



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా ఇక్కడ నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం తన శక్తివంచన లేకుండా కృషి చేస్తానని మంత్రి సీతక్క అన్నారు. సోమవారం పట్టణంలోని ఓ ప్రయివేట్ ఫంక్షన్‌హాల్‌లో బూత్ లెవల్ ఏజెంట్లు, కోఆర్డినేటర్ల సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. జిల్లాలోని అన్ని పెండింగ్ పనులను పూర్తి చేసి జిల్లాను అభివృద్ధిలో రాష్ట్ర పటంలో అగ్రభాగాన నిలుపుతామన్నారు. మనందరి భవిష్యత్తు బాగుండాలంటే కాంగ్రెస్‌ని ఆదరించాలన్నారు. ఆరు గ్యారెంటీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 100 రోజుల్లోనే ఐదు అమలు చేసి గ్యారంటిలకే గ్యారంటీ కాంగ్రెస్ అన్నారు. బీజేపీకి ఓటు వేస్తే రాష్ట్రాన్ని మన భవిష్యత్‌ను మనమే నాశనం చేసుకున్నవారమవుతామన్నారు. పదేండ్లు బీజేపీకి అధికారమిచ్చారు. ఈసారి కాంగ్రెస్ ప్రభుత్వానికి అవకాశమివ్వాలని కోరారు. అభివృద్ధి అంటే ఎలా ఉంటుందో చేసి చూపిస్తామన్నారు.

ప్రధాని మోడీ ఆదిలాబాద్‌కు ఏమిచ్చారు..!

మతాల గురించి తప్ప ప్రజలకు మంచి చేయాలన్న ఆలోచన కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వానికి లేదని విమర్శించారు. ప్రధాని మోడీ మన ఆదిలాబాద్‌కు వచ్చి ఏమిచ్చారని ప్రశ్నించారు. ఇక్కడ ఉన్న సమస్యలపై మాట్లాడకుండా ప్రతిపక్షాల విమర్శలకే తన సమయం కేటాయించారన్నారు. మూత పడ్డ సీసీఐ పరిశ్రమ ఊసే ఎత్తలేదన్నారు. రైల్వేలైన్‌పై భరోసా ఇవ్వలేదన్నారు. ఈ పదేండ్లు గద్దెనెక్కి ప్రజలపై అనేక ట్యాక్సులు మాత్రం వేసిందని ఎద్దేవా చేశారు.

ఎంపీగా సుగుణను గెలిపిద్దాం...

ఆదిలాబాద్ పార్లమెంట్ అభ్యర్థి ఆత్రం సుగుణను గెలిపించుకోవాల్సిన బాధ్యత మన ప్రతిఒక్కరిపై ఉందని సీతక్క అన్నారు. కాంగ్రెస్‌ను గెలిపిస్తే ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. గ్రామ గ్రామానికి నిధులు ఇప్పించే బాధ్యత తనదేనని అన్నారు. ఆదిలాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సుగుణను భారీ మెజార్టీతో గెలిపించి లోక్ సభకు పంపిస్తే మన సమస్యలపై తన గళాన్ని వినిపిస్తుందన్నారు. అందుకే మన ముందున్న లక్ష్యం ఒక్కటేనని అది సుగుణను గెలిపించడమే అన్నారు.

బేషజాలు లేకుండా ఇంటింటికీ తిరగాలి : ఎమ్మెల్యే

ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు మాట్లాడుతూ ప్రతి బూత్ లెవెల్ ఏజెంట్లు, కోఆర్డినేటర్లు క్లస్టర్ల వారీగా ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేయాలని, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను వివరించడంతో పాటు ప్రతిపక్షాల ప్రజావ్యతిరేక విధానాలు ఓటర్లకు వివరించి చైతన్య పర్చాలని అన్నారు. మండల, జిల్లాస్థాయి ఏ లీడరైనా పక్కా ప్రణాళికతో ముందుకుసాగాలన్నారు. అంతేగానీ గొప్పలకు పోయి ఇష్టారీతిన వ్యవహరిస్తే మొదటికే మోసం వస్తుందని స్పష్టం చేశారు. ప్రతి గడపకు.. ఇంటింటికీ వెళ్లి విస్తృత ప్రచారం చేపట్టాలని పిలుపునిచ్చారు.

తననుచట్టసభకు పంపించే బాధ్యత మీదే : ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ

ఆదివాసీ బిడ్డనైన తనను గెలుపించుకోవాల్సిన బాధ్యత మీదేనని కాంగ్రెస్ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ అన్నారు. 75 ఏండ్ల చరిత్రలో మొట్టమొదటిసారిగా ఆదివాసీ మహిళకు టికెట్ వచ్చిందని, అది తనకే దక్కడం అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. తన బలం, బలగం, శక్తి అంతా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలేనని అన్నారు. భావిభారత ప్రధానిని చేయడమే లక్ష్యంగా అందరూ కలిసి కట్టుగా పార్లమెంట్ అభ్యర్థినైన తనను గెలిపించుకుని అధిష్టానానికి బహుమతిగా ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి సత్తు మల్లేష్, బోథ్ నియోజక వర్గం ఇన్‌చార్జి ఆడె గజేందర్, బూత్ ఏజెంట్లు, కోఆర్డినేటర్లకు శిక్షణ నిచ్చేందుకు హైదరాబాద్ నుంచి వచ్చిన పార్టీ ప్రముఖులు, జిల్లా ముఖ్యనాయకులు ఆదిలాబాద్, బోథ్, ఖానాపూర్ నియోజక వర్గాల బూత్ ఏజెంట్లు, కోఆర్డినేటర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పాల్గొన్న కార్యకర్తలు , నాయకులు

ఎస్సారెస్పీ రైతులకు సాగు నీటి విడుదల

- ఫోన్‌లో అధికారులతో మాట్లాడిన ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి



నవతెలంగాణ-నిర్మల్

ఎస్సారెస్పీ ప్రాజెక్టు సరస్వతి కెనాల్ ద్వారా నీటిని విడుదల చేయాలని నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని తమ నివాసంలో సమావేశం ఏర్పాటు చేశారు. ముందుగా ఇరిగేషన్ శాఖ ముఖ్య కార్యదర్శితో మాట్లాడిన ఎమ్మెల్యే ఎస్సారెస్పీ నుంచి నీటిని ఇతర జిల్లాలకు దోచుకెళ్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్సారెస్పీ నుంచి 8 టీఎంసీల నీటిని ఇక్కడి నుంచి తీసుకెళ్లారని విమర్శించారు. చేతికొచ్చిన పంట ఎండిపోతుండటంతో అన్నదాతలు ఆవేదన చెందుతున్నారని అన్నారు. 42 ముంపు గ్రామాలు వ్యవసాయం మీదే ఆధారపడి ఉన్నారని అన్నారు. సరస్వతి కెనాల్ ద్వారా 6 టీఎంసీల నీరు అలాట్ చేస్తే, కేవలం నాలుగున్నర టీఎంసీల నీరు మాత్రమే ఇచ్చారని విమర్శించారు. ప్రాజెక్టు ఎండిపోయిందని మిగతా టీఎంసీన్నర నీరు ఇవ్వలేదని, ఇలా ఉత్తర తెలంగాణ రైతులకు అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. ఇక్కడి కాంగ్రెస్ నాయకులు ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. మంత్రి శ్రీధర్‌బాబు తీరుతో అన్నదాతలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని విమర్శించారు. ఎస్సారెస్పీ ముంపు గ్రామాలకు కూడా నీరివ్వడం లేదన్నారు. పంటలు ఎండినష్టపోయి, రైతులు అప్పులపాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అన్నదాతల దుస్థితికి ప్రభుత్వ నిర్లక్ష్యం, అధికారుల అలసత్వమే కారణమని విమర్శించారు. రైతుల పక్షాన వారికి న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని భరోసానిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఒక్కో మంత్రిది ఒక్కో తీరని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వం లెక్కే కాంగ్రెస్ కూడా దోచుకోవడం, దాచుకోవడం చేస్తుందని విమర్శించారు. సమావేశంలో సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు, ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంపీ ఎన్నికలో కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెప్పాలి

- ఎమ్మెల్యే పాయల శంకర్



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్‌కు వచ్చే ఎంపీ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక కాగ్నే ఫంక్షన్ హాలులో కార్యకర్తలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీలు జంగుబాయి, సులోచన, రాజేశ్వర్, వైస్ ఎంపీపీ పద్వాల్ గోపాల్ సింగ్, నాగోబా దేవాలయ చైర్మెన్ మెస్రం తుకారాంతో పాటు సర్పంచులు జుగాది రావ్, నాగోరావ్, మాజీ ఎంపీపీ కనక తుకారాంతో పాటు పలువురు సర్పంచులు ఎంపీ అభ్యర్థి గోడం నగేష్, ఎమ్మెల్యే ఆధ్వర్యంలో బీజేపీ కండువాను స్వీకరించారు. మండలం నుంచి సుమారు 200 మంది కాషాయ కండువాను కప్పుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయల శంకర్ మాట్లాడుతూ రాములోరి అంక్షితల్లో పాల్గొనని, కాంగ్రెస్‌కు ఎంపీ ఎన్నికలో ప్రజలు తగిన బుద్ధి చెప్పాల్సిన సమయం వచ్చిందన్నారు. అబద్ధపు హామీతో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడు పడిపోతుందో చెప్పలేమన్నారు. రైతులకు రూ.2 లక్షల రుణ మాఫీ ఇంకను చేయలేదని విమర్శించారు. ఎంపీ అభ్యర్థి గోడం నగేష్ మాట్లాడుతూ తాను ఆదివాసుల అభివృద్ధికి ఏమి చేయలేదని కొందరు కాంగ్రెస్ నాయకులు ఇటీవల ఇచ్చోడలో జరిగిన సమావేశంలో అవగాహన లేక మాట్లాడటం సమంజసం కాదన్నారు. తాను మంత్రిగా, ఎంపీగా ఉన్నప్పుడు 1996 పీసా చట్టం, జీఓ నెం.(3) తీసుకువచ్చానన్నారు. నెదర్లాండ్ ప్రభుత్వం అంగీకారంతో గిరిజనుల విద్యాభివృద్ధి కోసం రూ.100 కోట్లు తెచ్చిన ఘనత వారికి తెలియదా అని ప్రశ్నించారు. 1994లో కొత్తగా రాజకీయాల్లో వచ్చినప్పుడు ఉట్నూర్ నుంచి గుడిహత్నూర్ వరకు డుబుల్ బీటీ రోడ్డు, ఇంద్రవెల్లి మండలం మారుమూల గ్రామాల్లో బీటీ రోడ్లు తన హయంలోనే వేయడం జరిగిందన్నారు. ఈ అభివృద్ధి పనులు కాంగ్రెస్ నాయకులకు తెలువదా అని అన్నారు. రాబోయే ఎంపీ ఎన్నికల్లో తనకు ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్ మాట్లాడుతూ గతంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ మూడో స్థానంలో ఉందని, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రతి ఇంటికి బూత్ టూ బూత్‌కు వెళ్లి మోడీ ప్రవేశ పెట్టిన పథకాలను ప్రజలకు వివరించాలని దిశా నిర్దేశం చేశారు. మరింత కష్టపడి ఇంద్రవెల్లి నుంచి 10 వేల మెజారిటీ, ఉమ్మడి జిల్లా నుంచి లక్షపై చిలుకు మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీలు అర్క పుష్పలత, తాంసి జెడ్పీటీసీ తాటిపల్లి రాజు, సీడం భీమ్‌రావ్, కేంద్రే బాలాజీ, మండల అధ్యక్షులు ఆరెల్లి రాజలింగం, దీపక్ సింగ్ సేకావత్, ఆధినాథ్, అంకం మహేందర్ యాదవ్ పాల్గొన్నారు.

ఖానాపూర్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలి

- ఎస్‌ఎఫ్‌ఐ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు నామత్కర్ నవీన్



నవతెలంగాణ-నిర్మల్

ఖానాపూర్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ నిర్మల్ జిల్లా అధ్యక్షులు నామత్కర్ నవీన్ కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రజాసంఘాల కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. నిర్మల్ జిల్లా ఖానాపూర్ పట్టణ కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేక బడుగు, బలహీన, పేద విద్యార్థులు చదువుకోవడానికి స్థోమత లేక చదువు మధ్యలోనే ఆపేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా ప్రతినిధులకు అనేక సందర్భాల్లో విన్నవించడం జరిగిందని, ఈ సంవత్సరం వస్తుంది, ఈ సంవత్సరం వస్తుంది. అంటూ మాటలు చెప్పి కాలాన్ని గడిపేశారని విమర్శించారు. ప్రభుత్వం మారింది. స్థానిక ప్రజాప్రతినిధులు మారారని, ఈ ఆకడమిక్ ఇయర్ అయినా ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరు అవుతుందని, వేలాది మంది విద్యార్థులు ఎదురుచూస్తున్నారని ఆకాంక్షించారు. వెంటనే ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఎమ్మెల్యే కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. సమావేశంలో చంద్రకాంత్, ఉమాకాంత్ పాల్గొన్నారు.

మాజీ మంత్రిని కలిసిన మాజీ ఎమ్మెల్యే



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

నాగార్జునసాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భరత్ మాజీ మంత్రి జోగు రామన్నను తన నివాసంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తన సోదరితో కలిసి వచ్చిన ఆయన మాజీ మంత్రిని కలిసి పలు అంశాలపై చర్చించారు. అంతకుముందు వారికి స్థానిక నాయకులు సాదర స్వాగతం పలికారు. అదేవిధంగా ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కును కలిసి అభినందనలు తెలియజేశారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల సన్నద్ధత, ఇతరత్రా అంశాలపై ఇరువురు చర్చించారు. కార్యక్రమంలో పట్టణాధ్యక్షుడు అజయ్, నాయకులు నర్సాగౌడ్ ఉన్నారు.

బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థికి ఆహ్వానం



నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని సాలెగూడ గ్రామంలో హనుమాన్ విగ్రహ ప్రాణ ప్రతిష్టాపన మహోత్సవం 12న నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కును మర్యాద పూర్వకంగా కలిసి ఆహ్వానించారు. సోమవారం ఆలయ కమిటీ సభ్యులు కలిసి 12న నిర్వహించే ప్రాణప్రతిష్ట కార్యక్రమానికి తప్పకుండా హాజరు కావాలని, గోడప్రతులను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు శంకర్‌లొద్దిలో పూజా కార్యక్రమం



నవతెలంగాణ-ఉట్నూర్

నేడు శంకర్‌లొద్దిలో దీక్ష గురు ప్రేమ్‌సింగ్ మహారాజ్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు ఉంటాయని, గిరిజన లంబాడాలా ఐక్యవేదిక రాష్ట్ర ముఖ్య సమన్వయ కర్త గుగ్లోత్ రమేష్ నాయక్ అన్నారు. సోమవారం మండలం కేంద్రంలోని పెర్కగూడ సమీపంలో ఉన్న ఛత్రు నాయక్ ఫంక్షన్ హాల్‌లో సమావేశాన్ని నిర్వహించారు. మంగళవారం శంకర్‌లొద్దిలో నిర్వహించే పూజా కార్యక్రమాలకు సేవాలాల్ మాలాదారులు, బంజారా ప్రజలు భారీ ఎత్తున్న తరలి వచ్చి పూజా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వచ్చే భక్తులకు మధ్యాహ్నం అన్నదానం ఉంటుందని కోరారు. ఈ కార్యక్రమంలో లంబాడ జేఏసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ జగన్ నాయక్ అడ్వకేట్, లైవ్ ఆసిఫాబాద్ జిల్లా ఇన్‌చార్జి బానోత్ రవీందర్, ఖానాపూర్ నియోజకవర్గం సమన్వయ కర్త జాదవ్ రవి కిరణ్, పవార్ విజయ్ కుమార్, రమేష్, అల్లం కుమార్ పాల్గొన్నారు.

'బీజేపీని గెలిపిస్తే రాజ్యాంగం మారి రాజరిక వ్యవస్థ వస్తుంది'

నవతెలంగాణ-జైపూర్

బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీలు ఐక్యంగా ఉండి రాజ్యాంగ రక్షణ కోసం పోరాడాల్సిన అవసరముందని మాలమహానాడు చెన్నూర్ నియోజకవర్గం అధ్యక్షుడు శీలం వెంకటేశం అన్నారు. రాజ్యాంగ రక్షణ ముగింపు యాత్ర సంధర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించతలపెట్టిన మాల మహానాడు బహిరంగ సభకు జిల్లా నాయకులతో కలిసి సోమవారం బయలుదేరారు. ఈ సంధర్భంగా మాట్లాడుతూ రాజ్యాంగాన్ని రక్షించుకోవడం మనందరి బాధ్యతని, బీజేపీని గెలిపిస్తే రాజ్యాంగాన్ని మార్చి రాజరిక వ్యవస్థను తీసుకువచ్చే ప్రమాదం పొంచివుందని అన్నారు. రాబోవు ఎన్నికల్లో ఓటు అనే ఆయుధంతో బీజేపీని ఓడించి రాజ్యాంగాన్ని రక్షించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గరిసె రవీందర్, ధైర్యం లింగన్న, అలుగునూరి నరేష్, పరమేష్, బొజ్జ మల్లేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ-జైపూర్



మండల పరిధిలో గల వివిధ గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు సోమవారం చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. మండల పరిషత్ అధ్యక్షురాలు గోదారి రమాదేవితో పాటు పలువురు ఎంపీటీసీలు, వివిధ గ్రామాలకు చెందిన తాజా మాజీ సర్పంచులు ఆదివారం రాత్రి గంగిపల్లి మాజీ సర్పంచ్ లింగారెడ్డి నివాసంలో ఎమ్మెల్యే వివేక్ వారికి కండువా కప్పారు. చేరిన వారిలో ఎంపీటీసీ రాచర్ల సతీష్, బోయిని స్వాతి సంపత్, సర్పంచులు ఆవిడపు గణేష్, జాడి సారయ్య, ఇజ్జగిరి సమ్మయ్య, వెంకటేశ్‌గౌడ్ ఉన్నారు.

బాలికపై లైంగిక దాడి

నవతెలంగాణ-జైపూర్

జైపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని శివ్వారం గ్రామానికి చెందిన బాలికపై గ్రామానికి చెందిన వైద్య సురేష్(26) లైంగిక దాడికి పాల్పడ్డట్లు గ్రామస్తులు తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం ఇంటిలో ఎవరూ లేని సమయంలో సురేష్ 6 సంవత్సరాల బాలికపై లైంగిక దాడికి పాల్పడినట్లు ఆలస్యంగా వెలుగు చూసింది. విషయం తెలుసుకున్న జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, శ్రీరాంపూర్ సీఐ మోహన్‌తో కలిసి బాధిత కుటుంబాన్ని కలిసి సంఘటనకు సంబంధించిన సమాచారం సేకరించినట్లు తెలిసింది. నిందితున్ని అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపర్చుతున్నట్లు సమాచారం.

నేడు బీఆర్ఎస్ కార్యాలయం ప్రారంభం

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండల కేంద్రంలో మంగళవారం బీఆర్ఎస్ కార్యాలయాన్ని ప్రారంభించనున్నట్లు ఎంఎల్‌సీ దండె విఠల్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. కార్యాలయం ప్రారంభోత్సవానికి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నగునూరి శ్రీనివాస్, రాచకొండ కృష్ణ, శంకర్‌గౌడ్, బిట్టు శ్రీనివాస్, సుధాకర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మత్తు పదార్థాల నియంత్రణకు కఠిన చర్యలు

- మల్టీజోన్ ఐజి రంగనాథ్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్రంలో నిషేధిత మత్తు పదార్థాల నియంత్రణకు కఠిన చర్యలు తీసుకోవాలని ఒకటవ మల్టీ జోన్ ఐజి రంగనాథ్ ఆదేశించారు. సోమవారం జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. జిల్లాలో గంజాయి ఇతర నిషేధిత మత్తు పదార్థాలు నియంత్రణకు తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. గంజాయి, ఇతర నిషేధిత మత్తు పదార్థాల మొక్కల పెంపకం, రవాణా చేయడం, స్వీకరించడం చేసే వారిపైన ప్రత్యేక నిఘా పెట్టాలని తెలిపారు. ప్రజలకు భద్రత విషయంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. నిషేధిత మత్తు పదార్థాల విషయంలో ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. మత్తు పదార్థాలను రవాణా చేసినా, స్వీకరించినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఎస్పీ సురేష్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో నిషేధిత మత్తు పదార్థాల నియంత్రణకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. స్టేషన్ల వారీగా ఎప్పటికప్పుడు సమీక్ష చేయడంతో పాటు క్షేత్ర స్థాయిలో సమాచారాలను సేకరించి నిందితులను అదుపులోకి తీసుకుంటున్నట్లు తెలిపారు. సమావేశంలో అదనపు ఎస్పీ(అడ్మిన్) ప్రభాకర్‌రావు, ఆసిఫాబాద్ డిఎస్పి సదయ్య కాగజ్‌నగర్ డిఎస్పీ కరుణాకర్, సిఐలు, ఆర్ఐలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం : మంత్రి సీతక్క



నవతెలంగాణ-కెరమెరి

పేద బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమని మంత్రి సీతక్క అన్నారు. ఆదివారం రాత్రి మండల కేంద్రంలో ముఖ్య కార్యకర్తలతో కలిసి మాట్లాడారు. పదేళ్ల బీఆర్ఎస్, బీజేపీ పాలనలో పేద ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. వారి పాలనతో ప్రజలు విసుగు చెంది కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారని తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు అధిష్టానం సిద్ధంగా ఉందని చెప్పారు. పార్లమెంట్ అభ్యర్థి గెలుపు కోసం కార్యకర్తలు సైనికుల్లా పని చేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఆసిఫాబాద్ నియోజకవర్గ మైనార్టీ సెల్ ఇన్‌చార్జిగా ఎన్నికైన అబ్దుల్ రజాక్, ఎల్లప్ప సీతక్కను సన్మానించారు. అంతకుముందు పలువురు మాలీ సంఘం నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరడంతో వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు విశ్వప్రసాద్, ఆసిఫాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి అజ్మీరా శ్యాంనాయక్ పాల్గొన్నారు.

పురుగులమందు తాగి పోలీస్‌స్టేషన్ ముందే చనిపోతాం

- న్యాయం చేయాలని బాధితురాలి నిరసన

నవతెలంగాణ-జన్నారం



మాకు న్యాయం చేయకపోతే పోలీస్‌స్టేషన్ ముందే పురుగుల మందు తాగి చనిపోతామని, జన్నారం పట్టణానికి చెందిన అంగన్‌వాడీ టీచర్ తోకల సరస్వతి వారి కుటుంబ సభ్యులతో సోమవారం పోలీస్‌స్టేషన్ ముందు డబ్బాతో నిరసన తెలిపారు. గత నెల 16వ తేదీన, కడెం మండల ఈఈ కార్యాలయంలో, జూనియర్ టెక్నికల్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న తన కుమారుడు రాకేష్‌ను, ఆ కార్యాలయంలో పనిచేస్తున్న సీనియర్ అధికారులు వేధించడంతో, ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. తన కుమారుని ఆత్మహత్యకు కారణమైన అధికారులను, వెంటనే శిక్షించాలని, పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోవడం లేదన్నారు. తమకు న్యాయం చేయకపోతే, కుటుంబ సభ్యులమంతా కలిసి, పోలీస్‌స్టేషన్ ముందే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంటామని ధర్నా చేశారు.

నిలిచిన మిషన్ భగీరథ శుద్ధ జలం

- చేతి పంపుల వద్ద బారులు తీరిన జనం
- వేతనాలురాక విధులకు హాజరుకాని సిబ్బంది



నవతెలంగాణ-కెరమెరి

మూడు రోజులుగా మిషన్ భగీరథ శుద్ధ జలం సరఫరా కావడం లేదు. ఉదయం 7గంటలకు మిషన్ భగీరథ సిబ్బంది రోజు వారీగా శుద్ధ జలం సరఫరా చేయాల్సి ఉండగా, సిబ్బందికి వేతనాలు రాక పోవడంతో వారు విధులకు హాజరు కాలేదు. దీంత్ మండల కేంద్రంతో పాటు సమీపంలోని కెస్లాగూడ గ్రామస్తులు నీళ్ల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మూడు రోజులుగా శుద్ధ జలం సరఫరా లేక చేతి పంపుల వద్దకు జనాలు బారులు తీరారు. చేతి పంపులు సైతం సక్రమంగా పని చేయడం లేదు. బిందెడు నీళ్ల కోసం గంటల తరబడివేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో మూడు చేతి పంపులు ఉండగా ఒకటి మాత్రమే సక్రమంగా పని చేస్తోంది. 200 మందికి పైగా జనాభా కల్గిన ఎస్సీ కాలనీ వాసులు నీళ్ల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

కెస్లాగూడలో...

కెస్లాగూడలో కొన్ని రోజులుగా మిషన్ భగీరథ తాగు నీరు సక్రమంగా సరఫరా కావడం లేదు. సరఫరా అయినా నాచుతో కూడిన నీళ్ల వస్తున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. మిషన్ భగీరథ నీటిలో నాచు వస్తుండడంతో పాటు నీటిని శుద్ధి చేయడానికి వినియోగించిన పదార్థం వాసన ఎక్కువగా వస్తుంది. దీంతో ఆ నీటిని తాగడానికి వాడడం లేదు. ఇతర అవసరాలకు ఉపయోగిస్తున్నారు. గ్రామంలో బోరు ఉన్నప్పటికీ మరమ్మతులకు నోచుకోక పని చేయడం లేదు. గ్రామ పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా మరమ్మతులు చేపట్టడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలకు అవగాహనా సదస్సు


చింతలమానేపల్లిలో..

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు విజయనిర్మల ఆధ్వర్యంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులకు, చైర్‌పర్సన్‌లకు, ప్రధానోపాధ్యాయులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రిసోర్స్ పర్సన్ వినేష్ మాట్లాడుతూ ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లో అత్యవసర, నిర్వహణ పరమైన పనుల గురించి అవగాహన కల్పించారు. ప్రతి పాఠశాల వారీగా సంబంధిత ఏఈ పాఠశాలకు అవసరమైన తాగునీరు, విద్యుత్, చిన్నాపెద్ద మరమ్మత్తులు, మరుగుదొడ్ల మరమ్మత్తులు, నూతనంగా బాలికలకు మరుగుదొడ్లు నిర్మించడానికి ప్రతిపాదనల గురించి సంబంధిత పాఠశాలల కమిటీలు అవసరమైన పనులను తెలియజేయాలన్నారు. పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు కన్వీనర్‌లుగా, చైర్మన్‌గా వీవీ సభ్యులు ఉంటారని అన్నారు. పాఠశాల కమిటీలు సమావేశమై అవసరమైన పనులకు ఎస్టిమేషన్ చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అల్బర్ట్, తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు, ఏపీఎం సోనయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, వీవీ సభ్యులు పాల్గొన్నారు.

చింతలమానేపల్లి : మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో సోమవారం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల అవగాహన కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖ అధికారి బి.అశోక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల అభివృద్ధికి ఐదు అంశాల ను ప్రస్తావించారు. కార్యక్రమంలో ఎస్ఓ-2 అధికారి శ్రీనివాస్, ఎంఈఓ సోమయ్య, మండల నోడల్ అధికారి జయరాజ్, ఏపీఎం, మహిళా మండల అధ్యక్షురాలు, జిల్లా పరిషత్, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాలల నిర్వహణ బాధ్యత కమిటీలదే

నవతెలంగాణ-కౌటాల



పాఠశాలల పూర్తి నిర్వహణ బాధ్యత కమిటీలదేనని జిల్లా కోఆర్డినేటర్ భరత్‌కుమార్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతువేదికలో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలకు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భరత్‌కుమార్ మాట్లాడుతూ పాఠశాల భౌతిక వసతుల గురించి సమీక్షించి పాఠశాలల పూర్తి నిర్వహణ బాధ్యతను కమిటీలే నిర్వహించాలన్నారు. పాఠశాలలకు సంబంధించిన మౌళిక వసతుల ప్రణాళికలను రూపొందించుకోవాలని సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల సౌకర్యార్థం ప్రభుత్వం విడుదల చేసే నిధులను పారదర్శకంగా వినియోగించాలని, పాఠశాల అభివృద్ధికి పాటుపడాలన్నారు. పనుల్లో నాణ్యతలోపం లేకుండా పర్యవేక్షణ లోపం లేకుండా చూడాలన్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పాఠశాల అభివృద్ధికి ఒక సువర్ణవకాశమన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నస్రుల్లాఖాన్, అడిషనల్ డీఆర్‌డీఓ రామకృష్ణ, డీపీఎం అన్నాజీ, మండల విద్యాధికారి డి సోమయ్య, పీజీ హెచ్‌ఎంలు గావుడె హన్మంతు, నారాయణసింగ్, నానాజీ, ఏపీఎం ముక్తేశ్వర్, ఏఈ ప్రవీన్, మండల సమాఖ్య అధ్యక్షులు కమల, పలు ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

వేసవిలో ప్రజలు జాగ్రత్తలు పాటించాలి

- జిల్లా వైద్యాధికారి తుకారాం భట్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో ఎక్కువగా ఆదివాసులు ఉండడంతో పాటు అనేక రకాలైన వ్యాధులతో బాధపడుతున్న తరుణంలో కొండలు, గుట్ట లాంటి ప్రాంతాల్లో నివసిస్తున్న వారికి నిరంతర వైద్య సేవలు అందించడానికి కృషి చేస్తూ ప్రస్తుత వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జిల్లా వైద్యాధికారి తుకారాం భట్ నవతెలంగాణతో మాట్లాడారు. వేసవి తీవ్రత దృష్ట్యా ప్రజలు అవసరమైతేనే మధ్యాహ్నం 12 నుండి 4 గంటల మధ్య బయటకు వెళ్లొద్దని తెలిపారు. పిల్లలు, వృద్ధులు దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు ఎక్కువగా జాగ్రత్తలు పాటించాలన్నారు. నేషనల్ పాలసీ క్లైమేట్ చేంజ్ అండ్ హ్యూమన్ హెల్త్ అనేది మార్చి నుండి జూలై వరకు కొనసాగుతుందన్నారు. దీనికి గాను వాతావరణంలో వచ్చే మార్పులకు ప్రజలను సిద్ధం చేయడానికి వారికి అవగాహన కల్పించడానికి 15 మండలాల్లో ప్రతి మండలానికి ఒకరి చొప్పున జిల్లాస్థాయి అధికారులను నియమించడం జరిగిందన్నారు. జిల్లాలో అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 85704 ఓఆర్ఎస్, 6247 ఆర్ఎల్, 8229 ఎన్ఎస్‌లు అందుబాటులో ఉన్నాయన్నారు. మరో 1,50,000 ఓఆర్ఎస్ ప్యాకెట్లకు ప్రతిపాదనలు పంపించినట్లు తెలిపారు. గత సంవత్సరం మొత్తం 35 మంది ఎండ తీవ్రతకు గురికాగా ప్రస్తుతానికి అటువంటి కేసులు నమోదు కాలేదన్నారు. ఎండ దెబ్బ తగిలితే శరీరం పొడిబారుతుందని తెలిపారు. ఎండదెబ్బకు గురైన వ్యక్తిని నీడ ప్రాంతానికి తీసుకువచ్చి తడి గుడ్డతో శరీరం అంత తుడిచి ఓఆర్ఎస్ లేదా చక్కర, ఉప్పు కలిపిన నీటి ద్రావణాన్ని తాగించాలన్నారు. జిల్లాలో రక్తహీనత నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఏఎన్సి సమయంలో గర్భిణులను గుర్తించి వారికి డెలివరీ తర్వాత ఆరు నెలల వరకు మందులు అందిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 317 అనీమియా కేసులు ఉండగా 12 కేసులు పాజిటివ్ ఉన్నట్లు వివరించారు. పిల్లల్లో రక్తహీనత గుర్తింపు కోసం 'అబాకార్డ్' అందిస్తున్నట్లు తెలిపారు. ఇతర జిల్లాలతో పోలిస్తే జిల్లాలో 46 మెడికల్ ఆఫీసర్లకుగాను 14 మంది మాత్రమే పని చేస్తున్నారని, దీంతో కొంత ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. ఇతర జిల్లాలలో ఇచ్చిన రెమ్యూనరేషన్ కంటే కొంత అధికంగా ఇస్తే వైద్యాధికారులు పనిచేసే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఉన్నతాధికారులు ఆ దిశగా ఆలోచిస్తే కొంత బాగుంటుంది.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్


మాట్లాడుతున్న డీఈఓ పి. అశోక్

పదో తరగతి విద్యార్థులకు పాలిటెక్నిక్‌తో పాటు రెసిడెన్షియల్ కళాశాలలు, జ్యోతిబాపూలే కళాశాలల్లో ప్రవేశానికి నిర్వహించే కామన్ పరీక్షలకు జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి పి అశోక్ సూచించారు. కాగజ్‌నగర్‌లోని డీఆర్‌సీలో నిర్వహిస్తున్న ఈ ఉచిత శిక్షణ కేంద్రాన్ని సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే ఈ ఉచిత శిక్షణ ఇస్తున్నామని, దీనిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. పాలిసెట్ దరఖాస్తుకు ఈ నెల 22 చివరి తేదీ అని, జ్యోతిబాపూలే వెనకబడిన తరగతుల సంక్షేమ కళాశాల ప్రవేశపరీక్ష దరఖాస్తుకు ఈ నెల 12 చివరి తేదీ కాబట్టి విద్యార్థులు గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం ఈ శిక్షణకు 90 మంది బాలికలు, 42 మంది బాలురు హాజరవుతున్నారు. ఈ కార్యక్రమంలో కోచింగ్ సెంటర్ కో ఆర్డినేటర్ కటకం మధూకర్, కో కన్వీనర్ గడ్డం భిక్షపతి, సబ్జెక్టు నిపుణులు దుర్గం మోహన్, సాబీర్ అహ్మద్, వెంకట కిషన్‌రావు, మామిడాల తిరుపతయ్య, శాంతికుమార్, శ్యాంసుందర్, శాంతికుమార్, మామిడాల శ్రీశైలం, త్రివేణి పాల్గొన్నారు.

బాలికలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

నవతెలంగాణ-కెరమెరి

బాలికలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని షీ టీం ఇన్‌చార్జి సునీత అన్నారు. సోమవారం మండలంలోని మోడీ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో మహిళ చట్టాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేసి మాట్లాడారు. బాలికలు, మహిళల రక్షణ కోసమే షీ టీంలు పనిచేస్తున్నాయని తెలిపారు. విద్యార్థినులు, మహిళలు హింస, ఈవ్‌టీజింగ్, సైబర్ క్రైమ్ బారినపడితే వెంటనే షీటీంను సంప్రదించాలని సూచించారు. అత్యవసర సమయంలో డయల్ 100కు కాల్ చేయాలని సూచించారు. వేధింపులకు పాల్పడే వారి సమాచారాన్ని షీ టీం ఆసిఫాబాద్ 8712670564ను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రాధానోపాధ్యాయురాలు స్వర్ణలత, ఉపాధ్యాయులు, షీ టీం సభ్యులు, శ్రీలత, స్వప్న పాల్గొన్నారు.



తాగునీటి సమస్య లేకుండా ప్రత్యేక చర్యలు



నవతెలంగాణ-వేమనపల్లి

ఎండాకాలం నేపథ్యంలో తాగునీటి సమస్య లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని మండల ప్రత్యేక అధికారి ఉదయ్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని నీల్వాయి గ్రామంలో ఎంపీడీవో దేవేందర్‌రెడ్డితో కలిసి ఓవర్ హెడ్ ట్యాంకులను పరిశీలించారు. మండల కేంద్రంతో పాటు, నీల్వాయి బస్ స్టాప్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం మండల ప్రత్యేక అధికారులకు పంచాయతీ కార్యదర్శులకు ఉపాధి సిబ్బందికి అన్ని గ్రామ పంచాయతీలలో తాగు నీటి సరఫరా ప్రత్యామ్నాయ మార్గాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. అన్ని గ్రామ పంచాయతీలలో నీటి సరఫరా సక్రమంగా వుండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఉపాధి హామి పథకం క్రింద అందరు కూలీలకు పనులు కల్పించాలని ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రమేష్, పశువైద్యాధికారి అరుణ, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ నరేష్, ఎంపీఓ శ్రీపతి బాపు రావు, సీనియర్ సహాయకులు లక్ష్మీ నారాయణ, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

మట్టి తరలిస్తున్న ట్రాక్టర్ల పట్టివేత

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

కాగజ్‌నగర్ మండలంలోని మండువ నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను సోమవారం తహసీల్దార్ కిరణ్ ఆధ్వర్యంలో అధికారులు పట్టుకున్నారు. అనుమతులు లేకపోవడంతో ఈజ్‌గాం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మట్టిని అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ హెచ్చరించారు. ఆర్ఐ ఖలీల్, సిబ్బంది పాల్గొన్నారు.

మైనారిటీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

నవతెలంగాణ-నస్పూర్

తెలంగాణ రాష్ట్ర మైనారిటీ స్టడీ సర్కిల్, మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో యు.పి.ఎస్.సి. సివిల్ సర్వీసెస్-2025 ప్రవేశ పరీక్ష కొరకు 2024-25 విద్యా సంవత్సరంలో 100 మంది అర్హత కలిగిన మైనారిటీ నిరుద్యోగ అభ్యర్థులకు ఉచిత శిక్షణ అందించనున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి నీరటి రాజేశ్వరి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సివిల్ సర్వీసెస్ ఆప్టిట్యూడ్ టెస్ట్‌లో ప్రవేశం కోసం సాధారణ ప్రొఫెషనల్ డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థుల నుంచి ఈ నెల 22వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో టెమ్రిస్‌తెలంగాణ.సీజీజీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 28వ తేదీ ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జిల్లా కేంద్రంలోని బైపాస్ రోడ్డులో గల మైనారిటీ గురుకుల బాలికల పాఠశాలలో స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. హైదరాబాద్ తెలంగాణ రాష్ట్ర మైనారిటీ స్టడీసర్కిల్లో మొదటిసారి ప్రవేశం పొందే అభ్యర్థులు ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలని, ప్రవేశం పూర్తిగా మెరిట్ ప్రాతిపదికన జరుగుతుందని, రిజర్వేషన్ నియమం ప్రకారం మహిళా అభ్యర్థులకు 33 శాతం, అన్ని రిజర్వ్ కేటగిరీలలో దివ్యాంగులకు 5 శాతం సీట్లు కేటాయించడం జరుగుతుందని తెలిపారు. అర్హత, ఆసక్తిగల మైనారిటీ (ముస్లిం, క్రిస్టియన్, సిఖ్, జైన్, బుద్ధిస్ట్, పార్సి) అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, వివరాలకు ఆన్‌లైన్‌లో, 040-23236112 నంబర్‌లో సంప్రదించవచ్చని తెలిపారు.

రైతుల సౌకర్యార్థం కంట్రోల్ రూమ్ ఏర్పాటు

నవతెలంగాణ-నస్పూర్

జిల్లాలో 2023-24 రబీ సంబంధించి ప్రభుత్వం నిర్దేశించిన మద్దతు ధర చెల్లించి రైతుల వద్ద నుంచి వరిధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని, ఈ క్రమంలో రైతుల సౌకర్యార్థం కలెక్టర్ కార్యాలయం జిల్లా పౌరసరఫరాల కార్పొరేషన్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల వద్ద నుంచి నిబంధనల మేరకు నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరుగుతుందని, రైతులు కొనుగోలు కేంద్రాలలో వరిధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని తెలిపారు. కంట్రోల్ రూమ్‌లో రైతులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకుల నుంచి వచ్చే ఫిర్యాదులను రిజిస్టర్లో నమోదు చేయడం జరుగుతుందని, జిల్లా పౌరసరఫరాల శాఖ, జిల్లా పౌరసరఫరాల కార్పొరేషన్, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, జిల్లా సహకార శాఖ, జిల్లా సహకార మార్కెటింగ్ సంస్థ, రైస్ మిల్లర్ల సమన్వయంతో ఫిర్యాదులను పరిష్కరించడం జరుగుతుందని, రైస్‌మిల్లర్లు తమ మిల్లుల వద్ద కంట్రోల్ రూమ్ వివరాలను ప్రదర్శించాలని తెలిపారు. కంట్రోల్ రూమ్ ఉదయం 8 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు అందుబాటులో ఉంటుందని, ఫిర్యాదులు, వివరాలకు కంట్రోల్ రూమ్ 6303928682 నెంబర్‌ను సంప్రదించవచ్చని తెలిపారు.

ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు



నవతెలంగాణ-లక్షెట్టిపేట

పట్టణంలోని మదీనా మజీద్ మస్తాన్‌గూడాలో ముస్లిం సోదరులు ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు, పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు మాట్లాడుతూ రంజాన్ పండుగను ప్రతి ఒక్కరు ఆనందోత్సవాల మధ్య జరుపుకోవాలని పిలుపునిచ్చారు. రంజాన్ పండుగ సందర్భంగా అందించే ఇఫ్తార్ విందులు మత సామరస్యానికి ప్రతిగా నిలుస్తాయని పేర్కొన్నారు. ముస్లిం మైనార్టీల సంక్షేమానికి, వారి అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లక్షెట్టిపేట మైనార్టీ సంఘం అధ్యక్షుడు కోఆప్షన్ సభ్యులు సయ్యద్ షాహిద్ అలీ, పట్టణ అధ్యక్షుడు ఆరిఫ్, నవాబ్ ఖాన్, వార్డు అధ్యక్షుడు హాజీ, అమీర్ పాల్గొన్నారు.

జైపూర్ : ముస్లిం కుటుంబాల వారు అతి పవిత్రంగా భావించే రంజాన్ ఉపవాస దీక్షలను పురస్కరించుకుని ఇందారం ఎంపీటీసీ అర్కె స్వర్ణ సంతోష్ ఇఫ్తహార్ విందు ఏర్పాటు చేశారు. స్థానిక జమా-మసీదులో సోమవారం సాయంత్రం నమాజ్ అనంతరం ఉపవాస దీక్షలో ఉన్న ముస్లింలకు పండ్లతో విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ కోఆప్షన్ మెంబర్ జైనోద్దీన్, మోయిజుద్దీన్, రశీద్, ఎన్ఎస్‌యూఐ నాయకుడు నదీం, మొబీన్, రేగుంట సూర్య, కోల ప్రశాంత్ పాల్గొన్నారు.

నంది అవార్డు గ్రహీతకు సన్మానం

నవతెలంగాణ-లక్షెట్టిపేట



నంది అవార్డు గ్రహీతకు అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఘన సన్మానం చేశారు. ఈ సందర్భంగా అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షుడు ముల్కల్లా రాందాస్ మాట్లాడుతూ మండలానికి చెందిన కుశనపెల్లి దీప్తి విద్య ద్వారా ఎంతో మందిని వివిధ దేశాలకు పంపించి స్థిరపర్చినందుకు ఈ నెల 1వ తేదీన హైదరాబాద్ రవీంద్రభారతిలో నంది అవార్డు తీసుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం రాష్ట్ర నాయకులు దమ్మ నారాయణ, జిల్లా నాయకులు లింగంపల్లి వెంకటేష్, సినిగారపు లింగన్న, మాలెం చిన్నన్న, సీనియర్ నాయకులు తొగరు కాంతయ్య, మండల నాయకులు చుంచు, రమేష్ పాల్గొన్నారు.

తాగునీరు సమస్యలపై కంట్రోల్ రూమ్ ఏర్పాటు

నవతెలంగాణ-రామకృష్ణాపూర్



క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలో తాగు నీటి సరఫరా, లీకేజీల వలు సమస్యల పరిష్కారానికి మున్సిపల్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని సోమవారం మున్సిపల్ కమిషనర్ ఎస్.మురళి కృష్ణ పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వ పురపాలక శాఖ ఆదేశాల మేరకు ఏర్పాటు చేయడం జరిగిందని, పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని కోరారు. శానిటరి ఇన్స్‌పెక్టర్ ఇ.వసంత్ 8309960731, (ఓఎస్) వర్క్ ఇన్స్‌పెక్టర్ ఇ.రాజశేఖర్ 8074138866(ఓఎస్) వాటర్ సప్లయ్ సూపర్ వైజర్ బంటు నారాయణ 9391640311 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

పరిసరాల పరిశుభ్రత పాటించేలా చూడాలి



నవతెలంగాణ-జన్నారం

గ్రామంలో ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించేలా చూడాలని, గ్రామంలో నీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లు సూచించారు. సోమవారం మండలంలోని లింగాయ పల్లి గ్రామంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆ గ్రామపంచాయతీ కార్యాలయాన్ని రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం గ్రామంలో ఉన్న డంపింగ్ యార్డ్‌ను పరిశీలించారు. అలాగే గ్రామంలో చేపట్టిన పారిశుధ్య పనులను పరిశీలించి మండల అధికారులకు సూచనలు చేశారు. గ్రామంలోని అన్ని రహదారులు డ్రైనేజీలను పరిశీలించి ప్రతి రోజు శుభ్రంగా ఉంచాలని, అదే విధంగా ప్రతి రోజూ డ్రై వెస్ట్ కలెక్షన్ చెయ్యాలని, సెగ్రిగేషన్ షేడ్‌ని ఉపయోగించి పొడి చెత్తను సరియైన పద్దతిలో వేరు చెయ్యాలన్నారు. తడి చెత్త ద్వారా సరియైన పద్దతిలో ఎరువు తయారు చేయాలని ఆదేశించారు. పారిశుధ్య కార్మికులతో పద్దతి ప్రకారం పని చేయించాలని, ఎవరైనా పనులు చెయ్యకపోతే విధుల నుంచి తొలగించాలని కార్యదర్శులకు సూచించారు. గ్రామపంచాయతీ రికార్డులు పరిశీలించి రికార్డులు ఎప్పటికప్పుడు అప్డేట్ చెయ్యాలని ఆదేశించారు. గ్రామంలోని నీటి వనరులు, లభ్యత గురించి తెలుసుకొని ప్రస్తుతం నీటి లభ్యత ఉన్నప్పటికీ ప్రత్యమ్నాయ ఏర్పాట్లను గుర్తించి పెట్టుకోవాలని, తద్వారా గ్రామంలో ఎలాంటి పరిస్థితుల్లోనూ నీటి ఇబ్బంది జరగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీఓ రమేష్, పంచాయతి కార్యదర్శి ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రమాదానికి గురైన హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-వేమనపల్లి

ప్రమాదానికి గురైన హోంగార్డు కుటుంబానికి ప్రభుత్వ ఉపాధ్యాయులు సోమవారం రూ.25000 ఆర్థిక సాయాన్ని అందజేశారు. వేమనపల్లి మండలంలోని జులపేట గ్రామానికి చెందిన దుర్గం ధర్మయ్య ఉమ్మడి జిల్లాలలో పలు పోలీస్‌స్టేషన్‌లలో విధులు నిర్వహిస్తున్నారు. అతని భార్య అంగన్‌వాడీ టీచర్‌గా పని చేస్తున్నారు. వీరు గత నెల 11వ తేదీన బైకుపై లక్షెట్టిపేటకు వెళుతుండగా జైపూర్ అటవీ ప్రాంతంలో రాంగ్ రూట్లో అతివేగంతో వచ్చిన మరో బైక్ ఢీ కొట్టింది. ప్రమాదంలో భార్యాభర్తలిద్దరూ తలలకు బలమైన గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన నాటి నుంచి 14 రోజులు ధర్మయ్య కోమాలో ఉండిపోయారు. సహచర హోంగార్డులు, ఉన్నతాధికారుల సహకారంతో ఉన్నత వైద్యం కోసం కరీంనగర్ ఆస్పత్రికి తరలించి వైద్యం చేయించారు. అప్పు చేసి దాదాపు రూ.6 లక్షలు ఖర్చు చేశారు. ఇద్దరూ గాయాలతో లేవలేక మంచానికే పరిమితం కావడంతో పూట గడవడం కష్టంగా మారింది. వైద్యానికి డబ్బులు సరిపోక ఇబ్బంది పడుతున్నారని తెలుసుకున్న ఉపాధ్యాయులు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాదంపల్లి బీజేపీ గ్రామ కమిటీ అధ్యక్షునిగా సత్తయ్య



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని బాదంపల్లి బీజేపీ గ్రామ కమిటీ నూతన అధ్యక్షుడిగా మోట పలుకుల సత్తయ్య నియమితులయ్యారు. సోమవారం ఆ గ్రామంలో బీజేపీ మండల అధ్యక్షుడు గుండవరపు మధుసూదనరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పార్టీ కార్యకర్తల సమావేశంలో అతన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు మధుసూదన రావు మాట్లాడుతూ దేశంలో మరోసారి బీజేపీ అధికారంలోకి వస్తుందన్నారు. కార్యకర్తలంతా ఐక్యంగా ఉండి బీజేపీని గెలిపించాలన్నారు. ఆదిలాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి, గొడం నగేష్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు కొంతం శంకరయ్య, మహేష్, సామర్ల లక్ష్మీరాజం పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణ చర్యలపై క్షేత్రస్థాయి పర్యటన

నవతెలంగాణ-మందమర్రి

నీటి ఎద్దడి నివారణ చర్యలపై సోమవారం మండల పరిషత్ అభివృద్ధి అధికారి రాజేశ్వర్ ఆదిల్‌పేట్, చిర్రకుంట, మామిడిగట్టు గ్రామ పంచాయతీల్లో క్షేత్రస్థాయిలో పర్యటించారు. పంచాయతీలలోని బోర్ వేల్స్ పని తీరును గ్రామంలోని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. మిషన్ భగీరథలో సమస్యలు ఎదురైతే ప్రత్యామ్నాయంగా అగ్రికల్చర్ బోర్ వేల్స్‌ని వాడుకోవాలని, పైపు లైన్ లీకేజీలను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మహనీయుల స్ఫూర్తితో..

మతోన్మాద బీజేపీని ఓడిద్దాం



అభివాదం తెలుపుతున్న నాయకులు

నవతెలంగాణ-నస్పూర్

మహనీయుల స్ఫూర్తితో మతోన్మాద బీజేపీని ఓడిద్దామని కేవీపీఎస్, టీఏజీఎస్ నాయకులు అన్నారు. సోమవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని బీసీ భవన్‌లో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దూర్కే మోహన్ అధ్యక్షతన కేవీపీఎస్, టీఏజీఎస్ వత్తిదారుల సమన్వయ కమిటీల ఆధ్వర్యంలో 'రాజ్యాంగాన్ని రక్షించుకుందాం మనువాదాన్ని మట్టు బెడదాం' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య వక్తలు మాట్లాడుతూ దేశంలో నరేంద్ర మోడీ బీజేపీ ప్రభుత్వం అధికారంలో వచ్చిన నాటి నుంచి నేటి వరకు దళితుల మీద, మహిళల మీద రోజు రోజుకు దాడులు హత్యలు, అత్యాచారాలు పెరిగాయని అన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రం అయినటువంటి గుజరాత్ రాష్ట్రంలో ప్రదీప్ రాథోడ్ అనే యువకుడు గుర్రం ఎక్కడంతో కిందపడేసి కొట్టి చంపారని అలాగే మణిపూర్‌లో ఇద్దరు ఆదివాసి గిరిజన మహిళలను బట్టలూడదీసి నగ్నంగా ఊరేగించి సామూహిక అత్యాచారానికి ఒడిగట్టారన్నారని దుయ్యబట్టారు. ఆర్ఎస్ఎస్ కనుసన్నాలలో బీజేపీ ప్రభుత్వం భారత రాజ్యాంగాన్ని రద్దు చేయడానికి కుట్రలు చేస్తుందని, 3000 కిందటి మనస్మృతిని ప్రాచీన భారత రాజ్యాంగంగా ప్రవేశపెట్టాలని చూస్తుందన్నారు. బీజేపీ అగ్ర నాయకులు మాట్లాడుతూ 400 సీట్లు గెలిస్తే భారత రాజ్యాంగాన్ని రద్దు చేస్తామని బహిరంగంగా చెప్పడం అంటే పూర్తిగా రాజ్యాంగాన్ని రద్దు చేయడానికే పెద్ద ఎత్తునకుట్ర పన్నుతున్నారని మండిపడ్డారు. రాబోయే లోక్‌సభ ఎన్నికలలో మతోన్మాద పార్టీని ఓడించి తగిన గుణపాఠం చెప్పాలని వివిధ సంఘాల నాయకులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సామాజిక న్యాయవేదిక కన్వీనర్ ఆర్ రాజేశం, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు సుధీర్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు సంకే రవి, దళిత ఉద్యమ నాయకులు దేవి పోచం, కనకరాజు, సమతా సైనిక్ రాష్ట్ర నాయకులు దుర్గం సిద్ధార్థ రామ్మూర్తి, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి శ్రీకాంత్, బహుజన నాయకులు దుర్గం స్వామి, వృత్తిదారుల సమన్వయ కమిటీ నాయకులు బొడెంకి చందు, రాములు, కేవీపీఎస్ జిల్లా నాయకులు వంజరి గోపి, మాల మహానాడు రాష్ట్ర నాయకులు పుట్ట మధుకర్, దేవనపల్లి మధుకర్, కారం కిష్టంరాజు పాల్గొన్నారు.

బీసీ బిల్లు ప్రవేశపెట్టే పార్టీకే మద్దతు



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

బీసీ బిల్లు ప్రవేశపెట్టే పార్టీకే మా మద్దతు తెలుపుతామని బీసీ హక్కుల పోరాట సమితి నాయకులు పేర్కొన్నారు. సోమవారం మంచిర్యాలలోని జన్మభూమి నగర్‌లో జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో నాయకులు మాట్లాడుతూ రాబోయే లోక్ సభ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టే పార్టీకే బీసీల మద్దతు తెలియజేస్తామని అన్నారు. గత నాలుగు సంవత్సరాలుగా చట్ట సభలలో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఉద్యమాలు చేస్తున్నప్పటికీ మా న్యాయమైన డిమాండ్‌ను పరిష్కరించడంలో పాలక ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్నాయని మండిపడ్డారు. దేశంలో ఉన్న 85 కోట్ల ప్రజల ఆకాంక్షలను ఏ పార్టీ అయితే గుర్తిస్తుందో ఆ పార్టీకే బీసీ సమాజం అండగా ఉంటుందని అన్నారు. బీసీ రిజర్వేషన్ బిల్లుకు అనుకూలంగా దేశంలో గుర్తింపు పొందిన 27 రాజకీయ పార్టీలు అనుకూలంగా ఉన్నాయి. అలాగే 9 రాష్ట్ర ప్రభుత్వాలు అసెంబ్లీ తీర్మానం చేసి పంపినప్పటికీ బీసీ రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టకపోవడం బాధాకరమని విచారణ వ్యక్తం చేశారు. బీసీ బిల్లుకు అనుకూలంగా ఉండే పార్టీకే బీసీ ల మద్దతు ఇస్తామని ఏ పార్టీ అయితే బీసీ బిల్లుకు వ్యతిరేకంగా ఉంటుందో ఆ పార్టీని బీసీ సమాజం ముందు దోషిగా నిలబెడతామని అన్ని పార్టీలను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ హక్కుల పోరాట సమితి అధ్యక్షులు గుమ్ముల శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు గజ్జెల్లి వెంకన్న, నాయకులు కట్కూరి శ్రీనివాస్, కొత్తకొండ రమేష్, సంతోష్, నరేందర్ పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు వెంటనే చెల్లించాలి



నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ డివిజన్‌లో పనిచేస్తున్న మేషన్, చిప్పింగ్ కాంట్రాక్టు కార్మికుల వేతనాలను వెంటనే చెల్లించాలని సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్, శ్రీరాంపూర్ బ్రాంచ్ అధ్యక్షులు దొడ్డిపట్ల రవీందర్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్టు కాంట్రాక్ట్ కార్మికుల జీవితాలు ఉన్నాయని, అరకొర వేతనాలతో కాలం వెళ్ల దీస్తున్న కాంట్రాక్టు కార్మికులకు సకాలంలో జీతాలు రాక ఆవేదనకు గురవుతున్నారన్నారు. ప్రతి నెల కాంట్రాక్టు కార్మికులకు 10వ తేదీ లోపు జీతాలు చెల్లించాలని యాజమాన్యం సర్క్యులర్ జారీ చేసినప్పటికీ దానిని అమలుపరచడంలో యాజమాన్యం విఫలమైందన్నారు. యాజమాన్యం అనుభవం లేనటువంటి కాంట్రాక్టర్లకు కాంట్రాక్టు ఇచ్చి చేతులు దులుపుకోవడం వల్ల ఇలాంటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని ఇప్పటికైనా యాజమాన్యం వెంటనే స్పందించి గత 4నెలల నుండి మేషన్, చిప్పింగ్ కాంట్రాక్టు కార్మికులకు రావలసిన జీతాలను వెంటనే ఇప్పించాలని వారు ఈ సందర్భంగా యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, సాయికుమార్, కృష్ణ, మల్లేష్, తిరుపతి, మనోజ్, సంతు, రాజు, రవితేజ పాల్గొన్నారు.

'బీసీ జనగణన అడ్డుకుంది కాంగ్రెసే'



నవతెలంగాణ-జైపూర్

భారత రాజ్యాంగంలో ఎస్సీ, ఎస్టీలతో పాటు బీసీల రిజర్వేషన్ కల్పించాలని ప్రయత్నించిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ నిర్ణయానికి కాంగ్రెస్ అడ్డుపడిందని బీసీ ఐక్య వేదిక నాయకులు వడ్డెపల్లి మనోహర్, నీరటి రాజన్న ఆరోపించారు. మెజార్టీ వర్గాలైన బీసీ కులాల రిజర్వేషన్ ఏర్పాటుకు ప్రధానంగా ఆనాటి కాంగ్రెస్‌లో ఉన్న అగ్రకులాలకు చెందిన నాయకులు మాత్రమే అని ఆరోపించారు. సోమవారం జైపూర్ మండల కేంద్రం నుంచి శివ్వారం వరకు పెగడపల్లి, గంగిపల్లి, ఎల్కంటి, షెట్‌పల్లి, కుందారం, కిష్టాపూర్, వేలాల, పౌనూర్‌ల మీదుగా బీసీ చైతన్య యాత్ర కొనసాగింది. ఈ సంధర్భంగా మండల కేంద్రంలో మాట్లాడిన బీసీ ఐక్య వేధిక నాయకులు 75 సంవత్సరాల భారతావనిలో బీసీ జనగణ జరుగకపోవడం బాధాకరమని ఆవేధన వ్యక్తం చేశారు. 68 శాతం ఓటు శాతం కలిగిన బీసీ కులాల వారి ఓట్లతో పదవుల్లో కొనసాగుతూ రాజ్యాధికారాన్ని అనుభవిస్తున్న ఇతర కులాల నాయకులు బీసీ కులాల వారి పట్ల నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేధన వ్యక్తం చేశారు. అలనాటి వీపీ సింగ్ ప్రభుత్వం బీసీలకు 28 శాతం రాజకీయంగా రిజర్వేషన్ కల్పిస్తే గత ప్రభుత్వం దానిని 15 శాతానికి కుదించిన తీరు బాధాకరమని పేర్కొన్నారు. ఈ విషయంలో ఏ రాజకీయ పార్టీ స్పందించకపోగా ఏ ఒక్క నాయకుడు ప్రశ్నించలేకపోవడం శోచనీయమని అన్నారు. అధికారంలోకి రావడం కోసం గత ఎన్నికల్లో బీజేపీ పార్టీ బీసీ జనగణ చేస్తామని హామీ ఇచ్చి, సుప్రీం కోర్టు సాక్షిగా ఎట్టి పరిస్థితుల్లో బీసీ జనగణ చేయమని స్పష్టం చేసిన తీరు బాధాకరమని అన్నారు. 112 కులాలుగా బీసీలను విభజించి రాజ్యమేలుతున్న పాలకులను ప్రశ్నించాల్సిన అవసరం ఉందన్నారు. మండల కేంద్రం నుంచి ప్రారంభమైన చైతన్య యాత్రలో తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం మంచిర్యాల జిల్లా ఉపాధ్యక్షులు చెలిమల అంజన్నక, మండల అధ్యక్షుడు వేముల మల్లేష్, డాక్టర్ శంకరయ్యతో పాటు బీసీ కులాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

బోరుబావులను వినియోగించుకోవాలి



నవతెలంగాణ-జైపూర్

గ్రామ పంచాయతీల పరిధిలో వార్డు ప్రజల అవసరాల మేరకు ఏర్పాటు చేసిన బోరు బావులను అవసరానికి అనుగుణంగా వినియోగించుకోవాలని ఎంపీడీఓ గుర్రం సత్యనారాయణ అన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విద్యాసాగర్‌తో కలిసి గంగిపల్లి గ్రామ పంచాయతిలోని వార్డుల్లో పర్యటించిన ఆయన బోరు బావుల పని తీరును పరిశీలించారు. అందుబాటులో ఉన్న బోరు బావుల ద్వార నీరు వృథా కాకుండా ఉంటుందని, అందరికి అవరమైన సమయంలో బోరు బావుల ద్వార నీటిని తీసుకోవాలని ఈ సందర్భంగా వివిధ కాలనీల వారిని కోరారు. వేసవిలో భూగర్భ జలాలు అడుగంటడం ద్వార నీటి లభ్యత తగ్గుతుంది. నీటి లభ్యత ఆధారంగా ప్రతి కుటుంబానికి అవసరమైన నీటిని వాడుకునే విధంగా కాలనీ ప్రజలు సమన్వయంగా వ్యవహరించాలని కోరారు. గ్రామంలో గల ఎస్సీ కాలనీలో గల బోరు బావికి సంబంధించిన విద్యుత్ మోటర్ స్థానంలో కొత్తగా విద్యుత్ మోటర్ బిగించడానికి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. మిషన్ భగీరథ పైప్‌లైన్ ద్వార నీటి సరఫరాలో ఏర్పడిన సమస్యలను పరిష్కరించడం కోసం పనులు పురమాయించినట్లు తెలిపారు. అయినప్పటికీ నీటి సమస్య ఏర్పడితే అందుబాటులో గల వ్యవసాయ బోరు బావి నుండి నీటిని సరఫరా చేయడం కోసం ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు.

చెరువులు కబ్జా కాకుండా చూస్తాం



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని పొంతకల్ మేజర్ గ్రామపంచాయతీలో ఉన్న చెరువు భూములు కబ్జా కాకుండా చూస్తామని, గ్రామ ప్రత్యేక అధికారి ఎంపీఓ రమేష్ అన్నారు. సోమవారం పొనకల్ మేజర్ గ్రామపంచాయతీలో గ్రామ సభ నిర్వహించారు. గ్రామ సభలో గ్రామస్తులు, పొన్కల్ ఊర చెరువు కబ్జాకు గురవుతుందని, సామాజిక ఉద్యమకారుడు భూమా చారితో పాటు గ్రామస్తులు, అధికారులకు దరఖాస్తు చేశారు. పొనకల్ ఉర చెరువును కొంతమంది అక్రమంగా మొరం పోస్తూ కబ్జా చేసుకుంటున్నారని, రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. అలాగే మండల కేంద్రంలో 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని, జన్నారం పట్టణానికి భారీ వాహనాల రాకపోకలు నిలిపివేయడంతో, ఇక్కడ, వ్యాపారాలు, సక్రమంగా సాగడం లేదని భారీ వాహనాలను అనుమతించాలని, పలువురు గ్రామస్తులు అధికారులకు దరఖాస్తులు చేశారు. సానుకూలంగా స్పందించిన అధికారులు ఆ సమస్యలను పరిష్కరించడానికి ఉన్నత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. గ్రామంలో మంచినీటి సమస్య తలెత్తకుండా చూస్తామన్నారు. విద్యుత్తు మురుగునీటి కాలువలు, మంచినీటి సరఫరా పై ప్రత్యేక దృష్టి సాధిస్తామన్నారు. ప్రజలకు ఎలాంటి అవసరాలు ఉన్న గ్రామపంచాయతీలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాహుల్, బిల్ కలెక్టర్ అనిల్ పాల్గొన్నారు.

అమలుకాని హామీలతో కాంగ్రెస్ అధికారం



నవతెలంగాణ-జైపూర్

ఎన్నికలకు ముందు అసత్య ప్రచారాలు, అమలుకాని హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలు కోసం ప్రజల పక్షాన నిలబడి కొట్లాడుతామని బీఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు. బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పాలమాకుల సురేందర్ రెడ్డి, మండల పరిషత్ వైస్ ఎంపీపీ పెద్దపల్లి రమేష్‌ల ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలో సమావేశమయ్యారు. ఈ సంధర్భంగా నాయకులు మాట్లాడుతూ బీఆర్ఎస్‌ను వీడుతున్న నాయకులతో తమకు ఎలాంటి సంబంధం లేదని అన్నారు. ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు కోసం పుట్టుకొచ్చిన బీఆర్ఎస్‌లో అనసరమైన వారందరు వెళ్లిపోగా నిజమైన ఉద్యమకారులు ఉండిపోయారని, బాల్క సుమన్ నాయకత్వంలో ప్రజల కోసం పోరాడుతామని అన్నారు. మండలంలో బీఆర్ఎస్ ఖాళీ అయ్యిందని అనుకుంటున్నారు. కాని బీఆర్ఎస్ అవసరమైన నాయకత్వం ఉండి వచ్చే ఎన్నికల్లో మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకొస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో టేకుమట్ల ఎంపీటీసీ బడుగు రవి, మార్కెట్ కమిటి ఉపాధ్యక్షుడు అర్నె సమ్మయ్య, మేడి తిరుపతి, మాజీ ఎంపీపీ జాడి ఏసయ్య ధర్మరాజు, శేఖర్, రమేష్, లక్ష్మన్, మోర్ల లక్ష్మన్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్యల పరిష్కారానికి కంట్రోల్ రూమ్ ఏర్పాటు

నవతెలంగాణ-నస్పూర్

మున్సిపాలిటీ పరిధిలో తాగునీటి సమస్యలు పరిష్కరించేందుకు కంట్రోల్ రూమ్‌ను సోమవారం ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ చిట్యాల సతీష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని మున్సిపాలిటీ పరిధిలో ఎవరైనా మంచినీటి సౌకర్యార్థం ఇబ్బందులు ఎదురైతే ఫోన్ నెంబర్ 9553331187(ప్రశాంత్), 9550357732(హబీబ్) నెంబర్లకు కాల్ చేసి ఫిర్యాదు చేస్తే మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి సమస్య తలెత్తకుండా పరిష్కరిస్తారని పేర్కొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
5
ఆదిలాబాద్
మంగళవారం | ఏప్రిల్ 09, 2024 | www.navatelangana.com

నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

నవతెలంగాణ-దిలావర్‌పూర్



ప్రతి ఒక్కరూ నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని నిర్మల్ రూరల్ సీఐ శ్రీనివాస్ అన్నారు. సోమవారం దిలావర్‌పూర్ ఎస్సై పోగుల సుమాంజలి ఆధ్వర్యంలో కేంద్ర పోలీస్ బలగాలతో మండల కేంద్రంలో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఓటర్లు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. ఓటు హక్కు వినియోగించడం ప్రతీ పౌరుని విధి అని అన్నారు. ప్రతీ ఒక్కరూ ఎట్టి పరిస్థితుల్లోనూ ఓటు వేయాలని సూచించారు.

క్లినిక్‌లకు, ఆస్పత్రులకు అనుమతి తప్పనిసరి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా పరిధిలో నిర్వహిస్తున్న ఆయుష్ క్లినికులు, పాలిక్లినికులు, ఆస్పత్రులకు తెలంగాణ రాష్ట్ర ప్రయివేట్ మెడికల్ కేర్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ 2010 ప్రకారం ఖచ్చితంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయం నుంచి క్లినిక్ లేదా హాస్పిటల్ నడపడానికి తగు అనుమతులను పొందాలని జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారి డా.నరేందర్ రాథోడ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో ఆయుష్ క్లినిక్స్, హాస్పిటల్స్ నడుపుతున్న డాక్టర్స్, మేనేజ్మెంట్ క్లినిక్ లేదా హాస్పిటల్ నడపడానికి తగు అనుమతుల కొరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారికి కావాల్సిన పత్రాలు జతపరుస్తూ అప్లికేషన్ ఫామ్‌ను వెంటనే సమర్పించాలని పేర్కొన్నారు. జిల్లాలో అన్ని అలోపతి హాస్పిటల్స్, ఆయుష్ హాస్పిటల్స్, డయాగ్నొస్టిక్ సెంటర్‌లను రిజిస్ట్రేషన్ చేసుకున్న తర్వాతనే నడుపాలని తెలిపారు. రిజిస్ట్రేషన్ లేకుండా నడుపుతున్నటువంటి సెంటర్స్ తమ దృష్టికి వచ్చిన వెంటనే ఆ సెంటర్‌లను సీజ్ చేసి కేసు నమోదు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు.

వేసవి కాలంలో విద్యార్థులు జాగ్రత్తలు పాటించాలి

నవతెలంగాణ-ఖానాపూర్

వేసవికాలంలో విద్యార్థులు పలు జాగ్రత్తలు వహించాలని, పాత ఎల్లాపూర్ హెల్త్ ప్రొవైడర్ బి.రాణి అన్నారు. సోమవారం ప్రాథమిక పాఠశాల పాతఎల్లాపూర్ విద్యార్థులకు వేసవి కాలంలో వచ్చే వ్యాధులు, జాగ్రత్తలు గురించి అవగాహన కల్పించారు. విద్యార్థులు ఎండలో బయట తిరగవద్దని, ప్రతి రోజు 5 లీటర్ల నీళ్ల తాగాలని, కాటన్ దుస్తులు ధరించాలని, పండ్ల రసాలు తాగాలని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల పాతఎల్లాపూర్ ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు కిషన్, డి.స్వప్న, హెల్త్ అసిస్టెంట్ సంధ్య, ఆశ కార్యకర్త, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంపీ గెలుపే లక్ష్యంగా కృషి చేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బీజేపీ ఎంపీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు శక్తినంతా ధారపోసి కృషి చేయాలని, బీజేపీ తెలంగాణ ఎన్నికల ఇన్‌చార్జి బెల్గాం(కర్ణాటక) ఎమ్మెల్యే అభయ్ పాటిల్ అన్నారు. సోమవారం పట్టణంలోని ఓ ప్రయివేటు ఫంక్షన్ హాల్‌లో ఎమ్మెల్యే పాయల్ శంకర్ అధ్యక్షతన జరిగిన పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణలో వాతావరణం మారింది, 17 లోక్ సభ స్థానాల్లో 12 గెలిచే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా దక్షిణ భారత దేశంలో బీజేపీ తన పట్టును పెంచుకుందన్నారు. గతంలో కంటే ఈ ఎన్నికలల్లో మరిన్ని ఎక్కువ సీట్లు సాధిస్తున్నామన్నారు. ప్రతి నాయకుడు తన కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ వారి సలహాలు సూచనలు స్వీకరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు మహేశ్వర్‌రెడ్డి, పవార్ రామారావు పటేల్, హరీష్ బాబు, గోడం నగేష్, మయూర్ చంద్ర, అల్లాపూర్ అయ్యన్న, ప్రదీప్. బ్రహ్మానంద్, లాలమున్న, లోక ప్రవీణ్‌రెడ్డి, చిలుకూరి జ్యోతిరెడ్డి పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు వాగులో పడి వ్యక్తి మృతి

నవతెలంగాణ-సారంగాపూర్

ప్రమాదవశాత్తు వాగులో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని స్వర్ణ గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై చంద్రమోహన్ తెలిపిన వివరాల ప్రకారం... స్వర్ణ గ్రామానికి అచ్చు ఆశన్న (50) మోటార్ సైకిల్‌పై తన పంటపొలంలోకి నిర్మల్, స్వర్ణ రహదారి నుంచి లింగాపూర్ వైపు వెలుతుండగా వాహనం అదుపతప్పి లింగాపూర్ వాగులో పడి మృతి చెందాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. మృతునికి బార్య అనసూయ, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు.

నేడు గోపాలకృష్ణమఠంలో ఉగాది వేడుకలు

- పచ్చడి పంపిణీ, పంచాంగ శ్రవణం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని శ్రీ రామచంద్ర గోపాలకృష్ణ మఠంలో మంగళవారం ఉగాది పండగ సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని మఠాధిపతి శ్రీ యోగానంద సరస్వతి తెలిపారు. సోమవారం మఠంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మఠాధిపతి మాట్లాడారు. సనాతన హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఉదయం 9 గంటలకు ఉగాది పచ్చడి పంపిణీ ఉంటుందని, సాయంత్రం 6 గంటలకు చికిలి వెంకటేశ్వర శాస్త్రిచే పంచాంగం శ్రవణం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమాలకు హిందూ బంధువులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షులు ప్రమోద్ కుమార్ ఖత్రి, ప్రధాన కార్యదర్శి గెడం మాధవ్, గౌరవాధ్యక్షులు ప్రఫుల్ వర్ఖె, సభ్యులు రవీందర్, తోట పరమేశ్వర్, పడకంటి సూర్యకాంత్, నర్సోజి, లోలపు శ్రీనివాస్, మాదస్తు సంతోష్, మహిపాల్ పాల్గొన్నారు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

మనస్తాపంతో ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని యాపల్‌గూడలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. ఆదిలాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ ఫతేసింగ్ తెలిపిన వివరాల ప్రకారం.. యాపల్‌గూడ గ్రామానికి చెందిన పందిరి మహేందర్(34) ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు మహేందర్‌కు గత 14 ఏండ్ల కిందట మహారాష్ట్రకు చెందిన ఓ మహిళతో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. భార్య భర్తల మధ్య మనస్పార్థాలు ఏర్పాడటంతో గత శివరాత్రి రోజు గొడవపడి భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో భర్త మహేందర్ ఎలాంటి పనులు చేయకుండా మద్యానికి బానిసయ్యాడు. మనస్తాపంతో ఉన్న ఆయన ఆదివారం రాత్రి ఇంట్లో ఉరేసుకున్నాడు. సోమవారం తెల్లవారుజామున ఆయన ఇంటి తలుపులు తీయకపోవడంతో చుట్టు పక్కాల వారు ఇంటికిటికీ తలుపుల నుంచి గమనించారు. దీంతో ఆయన ఉరేసుకోని ఆత్మహత్య చేసుకోని ఉన్నాడు. అనంతరం పోలీసులకు సమాచారం అందజేశారు. మృతుడి తండ్రి సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. ఇదిలా ఉండగా మృతుని వద్ద సూసైడ్ నోట్ లభించిందని, ఆ సూసైడ్ నోట్ వాట్సప్‌లలో వైరల్ అవుతున్న విషయంపై ఎస్సై ముజాహిద్‌ను సంప్రదించగా ఆ విషయం తమ దృష్టికి వచ్చిందని దానిపై విచారణ చేపడుతున్నట్టు తెలిపారు.

నామినేషన్ ప్రక్రియపై

పూర్తిస్థాయిలో అవగాహన ఉండాలి

- 18 నుంచి నామినేషన్‌ల స్వీకరణ
- కలెక్టర్ రాజర్షిషా



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా నామినేషన్ ప్రక్రియపై సహాయ రిటర్నింగ్ అధికారి బోథ్ ఖుష్బు గుప్తా, తహసీల్దార్‌లకు పూర్తి స్థాయిలో అవగాహన ఉండాలని, జిల్లా రిటర్నింగ్ ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షిషా అన్నారు. సోమవారం తన ఛాంబర్‌లో జిల్లాలోని తహసీల్దార్లకు నామినేషన్ ప్రక్రియపై ఏఆర్‌ఓ, ట్రైనీ కలెక్టర్ వికాస్ మహతోతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఏప్రిల్ 18వ తేదీ నుంచి లోక్‌సభ ఎన్నికల నామినేషన్‌ల స్వీకరణకు ఎన్నికల అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. ఫిబ్రవరి 28న వెలువడిన గైడ్ లైన్ ప్రకారం పాటించాలని, అభ్యర్థులు ఏప్రిల్ 18వ తేదీ నుంచి 25వ తేదీ వరకు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ దాఖలు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ ప్రక్రియ మొత్తాన్ని వీడియోగ్రఫీ చేయాలని, అభ్యర్థులు సమర్పించే అఫిడవిట్‌లో ఎలాంటి బ్లాంక్‌లు లేకుండా చూసుకోవాలని, చెక్‌లిస్ట్ ప్రకారం నామినేషన్ ఫారం అభ్యర్థులు సమర్పించేలా చూడాలన్నారు. నామినేషన్ స్క్రూటినీ రిటర్నింగ్ అధికారి మాత్రమే చేయాల్సి ఉంటుందన్నారు. 26న నామినేషన్‌లను పరిశీలించడం, 29వ తేదీ వరకు ఉపసంహరణకు గడువు ఉంటుందని, మే 13న పోలింగ్, కౌంటింగ్ జూన్ 4న జరుగుతుందని తెలిపారు. అధికారులు పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఈ నెల 15వ తేదీ వరకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఎలక్టోరల్‌కు సంబంధించి ఆపరేటర్, సిస్టమ్స్ ఏర్పాటు చేయాలని అన్నారు.

నామినేషన్ వేసే అభ్యర్థులకు కలెక్టర్ సూచనలు...

ప్రతి ఎలక్షన్ వద్ద, అభ్యర్థి తన నామినేషన్ పత్రాలతో పాటు అతని, ఆమె ఫోటోను సమర్పించాల్సి ఉంటుందన్నారు. ఏదైనా సందర్భంలో, నామినేషన్ల పరిశీలన కోసం నిర్ణయించిన తేదీ నాటికి తాజాగా సమర్పించాలన్నారు. ఛాయాచిత్రం వెనుక వైపున అభ్యర్థి, ఎన్నికల ఏజెంట్ సంతకాన్ని కలిగి ఉండాలని సూచించారు. ఫోటో నోటిఫికేషన్ తేదీకి 3 నెలల ముందు వ్యవధిలో తీయబడి ఉండాలని, ఛాయాచిత్రం స్టాంపు పరిమాణం 2-2.5 సెంటీమీటర్లు ఉండాలన్నారు. అభ్యర్థికి అనుకూలమైన విధంగా ఫోటో రంగు లేదా నలుపు, తెలుపులో ఉండవచ్చన్నారు. ఫోటోగ్రాఫ్ సాధారణ దుస్తులలో ఉండాలని యూనిఫోరంలో ఫోటోగ్రాఫ్ అనుమతించబడదని తెలిపారు. క్యాప్స్, టోపీలకు దూరంగా ఉండాలన్నారు. ముదురు అద్దాలను కూడా నివారించాలన్నారు. అన్ని నామినేషన్ పత్రాలు, స్వీకరించిన పత్రాలు రిటర్నింగ్ అధికారి లేదా ఏఆర్‌ఓ వ్యక్తిగత కస్టడీలో ఉంచబడతాయన్నారు. ఇతర వ్యక్తులు వాటిని యాక్సెస్ చేయకూడదని అన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన పలువురు కౌన్సిలర్లు

- మంత్రి సీతక్క సమక్షంలో చేరిన బీజేపీ, బీఆర్ఎస్ కౌన్సిలర్లు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాష్ట్రంలో అన్ని పార్టీల చూపు కాంగ్రెస్‌పైనే ఉందని ఎలక్షన్ నాటికి పార్టీ ఎన్నడూ లేనంత శక్తి వంతంగా తయారై విజయ పథంలో దూసుకు పోతుందని మంత్రి సీతక్క అన్నారు. సోమవారం ఓ ప్రయివేట్ ఫంక్షన్ హాల్‌లో బూత్ లెవల్ ఏజెంట్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నుంచి పలువురు కౌన్సిలర్లు పార్టీలో చేరారు. బీఆర్ఎస్ నుంచి 3వ వార్డు కౌన్సిలర్ సాయి ప్రణయ్, మాజీ జెడ్పీటీసీ కొండ గంగాధర్, 7వ వార్డు కౌన్సిలర్ అంజు పారిక్ రావు, 3వ వార్డు నుంచి శంకర్, 35వ వార్డు ప్రెసిడెంట్ అతిక్ ఉర్ రెహమాన్, మాజీ కౌన్సిలర్ ఖలీల్, ఆనంద్, ఆకాష్, అజయ్, మాధస్తూ మహేందర్, కావటి మోహన్, సూరజ్ సోన్కాంబ్లె, రఘునాథ్ ఆడే, అనుదీప్ కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. అలాగే బీజేపీ నుంచి ఎంపీ టికెట్ ఆశించి భంగపడిన డి.శ్రీలేఖ ఆదివాసీ తన భర్త ప్రశాంత్‌తో కలిసి కాంగ్రెస్‌లో చేరారు. సుజయ్, బాలాజీ, సందీప్, రాథోడ్ సురేందర్, జాదవ్ తరుణ్, నారాయణ, నవీన్ జాదవ్, సంతోష్, శ్రావణ్, మహేందర్, శ్రీకాంత్, దీపక్ పలువురు బీజేపీ పార్టీ నుంచి మంత్రి సీతక్క ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారందరికి మంత్రి సీతక్క కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా స్వాగతించారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, టీపీసీసీ జనరల్ సెక్రటరీ సత్తు మల్లేష్, ఆదిలాబాద్ పార్లమెంట్ అభ్యర్థి ఆత్రం సుగుణ, ఆదిలాబాద్, బోథ్ నియోజక వర్గాల ఇన్‌చార్జీలు కంది శ్రీనివాస్‌రెడ్డి, ఆడె గజేందర్, బూత్ ఏజెంట్లు, ఆదిలాబాద్, బోథ్, ఖానాపూర్ నియోజకవర్గాల బూత్ ఏజెంట్లు పాల్గొన్నారు.

దేశం ప్రశాంతంగా ఉండాలంటే బీజేపీని ఓడించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

దేశం ప్రశాంతంగా ఉండాలన్న, కార్పొరేట్ పెట్టుబడిదారులదోపిడీని అడ్డుకోవాలన్న, ప్రజలకు కనీస ప్రజాస్వామిక హక్కులు దక్కాలంటే ఈసారి జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా నాయకులు జగన్‌సింగ్ అన్నారు. సోమవారం పట్టణంలోని కుమురంభీం భవన్‌లో నిర్వహించిన మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగన్ సింగ్ మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వ పదేండ్ల పాలనలో దేశ ఆర్థిక వ్యవస్థను పెట్టుబడిదారులకు కట్టబెట్టాడని అన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటి పేద, మధ్య తరగతి ప్రజల కొనుగోలు శక్తి క్షీణించిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఎన్నికల్లో సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తానని చెప్పి నిరుద్యోగ విద్యార్థి యువతను తీవ్రంగా మోసం చేశారన్నారు. ప్రజాస్వామ్యవాదులను, ప్రశ్నించే గొంతులను, చివరికి ప్రతిపక్షాలను ఈడీ, సీబీఐ, ఎన్ఐఏ సంస్థలతో ముప్పు తిప్పలు పెడుతూ నిరంకుశంగా అప్రజాస్వామిక పద్ధతులతో అణిచివేస్తున్నారని అన్నారు. 400 సీట్లు గెలిపిస్తే భారత రాజ్యాంగాన్ని మారుస్తామని బీజేపీ దాని మిత్రపక్షాలు నిసిగ్గుగా ప్రకటిస్తున్న వైనాన్ని దేశ ప్రజలు వ్యతిరేకించాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎంఎల్) మండల నాయకులు కుమ్ర అశోక్, కొడప సురేష్, సీడం సాయికుమార్, మడవి రేణుక, టేకం అంజలి పాల్గొన్నారు.

తాగునీటి బావి అసంపూర్తి పనులను పరిశీలించిన అధికారులు



నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలోని తాగునీటి బావి అసంపూర్తి పనులను సోమవారం మండల అధికారులు పరిశీలించారు. ఇటీవల లక్ష్మీపూర్ చెక్‌పోస్ట్ వద్దకు ఆకస్మిక తనిఖీకి వచ్చిన కలెక్టర్ రాజర్షిషాకు గ్రామస్తులు తాగునీటి సమస్యపై వివరించారు. స్పందించిన జిల్లా కలెక్టర్ గ్రామసమీపంలోని గతంలో అసంపూర్తిగా ఉన్న బావి పనులను త్వరగా పూర్తి చేయాలని ప్రత్యేక అధికారికి సూచించారు. కేంద్ర ప్రభుత్వం ఆదివాసీ, గిరిజనుల కోసం ప్రత్యేక నిధులతో మంజూరు చేస్తుందని ఆ నిధులతో చేపడుతున్న గ్రామపంచాయతీ, కమ్యూనిటీ భవనంతో పాటు బోర్ బావిని వేసేందుకు స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడుకే పరిష్కరించాలన్నారు. అదేవిధంగా వేసవికాలంలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కోరారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున ఉపాధి హామీ కూలీలు ఉదయం పూటనే పనులకు వెళ్లాలన్నారు. అనంతరం బావి పనులను పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం అంతర్ రాష్ట్ర చెక్‌పోస్ట్‌ను తహసీల్దార్ రాజమోహన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో చెక్ పోస్ట్ వద్ద ప్రతి వాహనాన్ని క్షుణంగా పరిశీలించాలన్నారు. ఓటర్లను ప్రభావితం చేసేందుకు. అక్రమంగా మద్యం, డబ్బులను సరఫరా చేస్తారని వాటిపై ప్రత్యేకంగా నిఘా ఉంచాలన్నారు. ముఖ్యంగా సరిహద్దు ప్రాంతంలో ఉన్న చెక్‌పోస్టుల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. వాహనాలు తనిఖీ చేసేటప్పుడు రెవెన్యూ శాఖ పోలీస్ శాఖ ఎక్సైజ్‌శాఖలు కలిసి ఫోటోగ్రఫీ వీడియోగ్రఫీ తీస్తూ వాహనాలను తనిఖీ చేయాలన్నారు. ముఖ్యంగా ఎవరైనా రూ.50 వేలకుపైగా తీసుకువస్తే దానికి సంబంధించిన రసీదులు తప్పనిసరిగా ఉంచుకోవాలన్నారు. చెక్‌పోస్ట్ వద్ద చలివేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం చెక్‌పోస్ట్ వద్ద ఏర్పాటు చేసిన రిజిస్టర్‌ను పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇందులో తహసీల్దార్ రాజమోహన్, ఎంపీడీఓ శేఖర్, ఎంపీఓ వినోద్, మిషన్ భగీరథ ఏఈ మహేష్, పంచాయతీ కార్యదర్శి సంతోష్ ఉన్నారు.

వైద్య శిబిరాన్ని సందర్శించిన డీఎంహెచ్ఓ



నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండలంలోని చామన్‌పల్లిలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని సోమవారం డీఎంహెచ్ఓ డాక్టర్ దన్‌రాజ్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాధులు ప్రబలకుండా నియంత్రణ, నివారణ చర్యలు చేపట్టాలని వైద్యాధికారిణి ప్రత్యుష, సిబ్బందిని ఆదేశించారు. ఇంటింటా సర్వే నిర్వహించి, రోగులను గుర్తించి చికిత్స అందించాలని కోరారు. ఎండలు తీవ్రమవుతున్న దృష్ట్యా వడదెబ్బ తగలకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. ప్రతి ఆశ కార్యకర్త దగ్గర, అంగన్‌వాడీ కేంద్రాల్లో, గ్రామపంచాయతీల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్స్ అందుబాటులో ఉంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమ నిర్వహణాధికారి డాక్టర్ శ్రీనివాస్, డిప్యూటీ జిల్లా విస్తరణ, మీడియా అధికారి బారె రవీందర్, డాక్టర్ ప్రత్యూష, హెచ్ఈఓ శేషయ్య సిబ్బంది పాల్గొన్నారు.

డ్రైనేజీ నిర్మాణ పనుల పరిశీలన



నవతెలంగాణ-నిర్మల్

జిల్లా కేంద్రంలోని వార్డు నెం.33 ఎన్టీఆర్ మార్గ్ రోడ్ నెం.07 ప్రాంతంలో డ్రైనేజీ పనులను మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్ సోమవారం పరిశీలించారు. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేక ప్రజలకి ఇబ్బందిగా, సమస్యగా మారడంతో ప్రజల సౌకర్యార్థం డ్రైనేజీ నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. చైర్మెన్ వెంట మున్సిపల్ సిబ్బంది, కాలనీవాసులు ఉన్నారు.

ఇఫ్తార్ విందుకు హాజరైన కంది శ్రీనివాస్‌రెడ్డి



నవతెలంగాణ-బేల

మండల కేంద్రంలోని మదీనా మసీద్ వద్ద స్థానిక ముస్లీం సోదరులు, కాంగ్రెస్ శ్రేణులు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు సోమవారం కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయనకు ముస్లీం సోదరులు మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ముస్లింలకు అత్యంత పవిత్రమైన రంజాన్ మాసంలో ఇఫ్తార్ విందుకు ప్రత్యేకత ఉందన్నారు. అందరితో కలిసి విందులో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. ముస్లిం సోదరులకు పవిత్ర రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజా రెడ్డి, అవాల్‌పూర్ ఎంపీటీసీ నగేష్‌రెడ్డి, బేల మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఫైజుల్ల ఖాన్, మండల మాజీ జెడ్పీటీసీ రాందాస్ నాక్లే, మార్కెట్ మాజీ చైర్మెన్ వామన్ వాంఖడే, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సంజయ్ గుండావార్, మండల కిసాన్ సెల్ అధ్యక్షుడు ఘన్ శ్యామ్, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు మాడవి చంద్రకాంత్, మౌలానా, అక్తర్, మోబిన్, శంకర్ బొక్రె, సవాపురే విలాస్, మైనారిటీ నాయకులు ఎం.ఏ షకీల్, కయ్యుమ్, రఫీక్, కొండ గంగాధర్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాబోయే ఎన్నికలు ప్రశాంతంగా జరగాలి

నవతెలంగాణ-తాంసి

రాబోయే లోక్‌సభ ఎన్నికలు ప్రజలు ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛగా నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం ఆదేశాల మేరకు సోమవారం భీంపూర్ మండలంలో నిపాని, పిప్పల్‌కోటి గ్రామాల్లో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో జైనథ్ సీఐ డి.సాయినాథ్, సీఆర్పీఎఫ్ సీఐ సూరజ్, భీంపూర్ ఎస్సై ప్రదీప్ కుమార్, పోలీస్ సిబ్బంది కేంద్ర బలగాలైన సీఆర్పీఎఫ్‌తో కలిసి గ్రామాల్లో పోలీస్ కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజనుద్దేశించి సీఐ పి.సాయినాథ్ మాట్లాడుతూ గ్రామాల్లో ఎవరు కూడా బెల్ట్ షాపులు, మహారాష్ట్ర దేశీదారు అమ్మడం వంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించరాదని అన్నారు. అటువంటి వ్యక్తులపై నిఘా ఏర్పాటు చేసినట్టు, గొడవలకు తావు లేకుండా పోలీస్‌లు ఎల్లవేళల ప్రజల కోసం పని చేస్తారని తెలిపారు. రాబోయే లోకసభ ఎన్నికలు సజావుగా జరగడానికి పోలిస్ సిబ్బందికి సహకరించాలని కోరారు. ఎన్నికల సమయంలో కేసుల్లో ఇరుక్కోవడం మంచిది కాదన్నారు. గ్రామాల్లో ఉన్న నాయకులు, ప్రజలు కలిసిమెలిసి ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ఉన్నారు.

